
వార్త
ఆదివారం
9 మార్చి, 2025



# ఆరోగ్యామృతం.. వైద్య పర్యాటకం

## తారాతీరం



# జూన్‌లో 'కుబేర'

టాలీవుడ్ ప్రముఖ దర్శకుడు శేఖర్ కమ్ముల పాన్ ఇండియా స్థాయిలో తెరకెక్కిస్తున్న తాజా చిత్రం 'కుబేర'. ఈ సినిమాలో ప్రధాన పాత్రల్లో అక్కినేని నాగార్జున, తమిళ హీరో ధనుష్ నటిస్తున్నారు. రష్మిక మందన్న కీలక పాత్ర పోషిస్తోంది. అయితే, తాజాగా ఈ చిత్రం రిలీజ్ డేట్ ఖరారైంది. జూన్ 20న ఈ చిత్రాన్ని విడుదల చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇక ఇప్పటికే సినిమా నుంచి నాగార్జున, ధనుష్, రష్మిక ఫస్ట్ లుక్ పోస్టర్లు విడుదల చేశారు. రష్మిక క్యారెక్టర్ గ్లింప్స్‌తో పాటు టీజర్ కూడా విడుదలైంది. ఈ చిత్రం భిన్నమైన సోషల్ డ్రామా కథాంశంతో తెరకెక్కుతున్నట్లు సమాచారం. ఇందులో ధనుష్‌ను చాలా కొత్తగా చూపించబోతున్నారని టాక్. రాక్ స్టార్ దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్న ఈ సినిమాను శ్రీ వెంకటేశ్వర సినిమాస్ ఎల్ఎల్‌పీ బ్యానర్‌లో సునీల్ నారంగ్, రామ్మోహన్ రావు కలిసి నిర్మిస్తున్నారు.



# ఊర్వశి రౌతేలా కొత్త మూవీ!

బాలీవుడ్ బ్యూటీ ఊర్వశి రౌతేలా ఇటీవల టాలీవుడ్‌లో వరుస అవకాశాలు దక్కించుకుంటోంది. ఆమె రీసెంట్‌గా నందమూరి బాలకృష్ణ నటించిన 'డాకు మహారాజ్' చిత్రంలో నటించగా– అందులో కేవలం డ్యాన్స్‌కే పరిమితం కాలేదు. ఓ కీలక పాత్రలో ఆమె నటించి తన సత్తా చాటుకుంది. ఇక ఆ సినిమాలో బాలయ్యతో కలిసి ఊరమాస్ స్టెప్పులేసి ప్రేక్షకులను అలరించింది. ఈ సినిమా ఊర్వశి రౌతేలాకు మంచి కాన్ఫిడెన్స్‌ను అందించింది. ఇక ఇప్పుడు మరో నందమూరి హీరో సినిమాలో ఈ బ్యూటీకి అవకాశం దొరికినట్లుగా వార్తలు వినిపిస్తున్నాయి. మ్యాన్ ఆఫ్ మాసెస్ ఎన్టీఆర్, దర్శకుడు ప్రశాంత్ నీల్ కాంబోలో తెరకెక్కుతున్న ఎన్టీఆర్ నీల్ మూవీలోనూ ఈ అమ్మడికి ఛాన్స్ దక్కినట్లు తెలుస్తోంది. అయితే, ఇందులోనూ కేవలం డ్యాన్స్ నంబర్‌కే పరిమితం కాకుండా సినిమాలో ప్రాధాన్యత ఉన్న పాత్రలో ఊర్వశి నటించనున్నట్లు తెలుస్తోంది. ఇలా నందమూరి హీరోల సినిమాలతో టాలీవుడ్‌లో మంచి గుర్తింపును తెచ్చుకుంటున్న ఊర్వశి రౌతేలాను తమ సినిమాల్లో తీసుకునేందుకు మిగతా మేకర్స్ కూడా ఆసక్తిని చూపుతున్నట్లు సమాచారం.

ఆదివారం వార్త
9 మార్చి, 2025

## మంచి ముత్యాలు

విచిత్రాన్ని వదిలెయ్యి. పాత పద్ధతులను అనుసరించడంలో కన్నా నూతన పద్ధతులను పాటించడంలోనే తక్కువ ఆడంబరం కనిపించవచ్చు.

– జోసఫ్ జౌబర్ట్

మానవులు బోధిస్తూ నేర్చుకుంటారు. – సెనెకా

## కదంబం

'సంఘీ'భావం....5
రవాణా రంగంలో పెనుమార్పులు

కవర్ స్టోరీ..6
ఆరోగ్యామృతం..
వైద్య పర్యాటకం

మానవ సం'బంధాలు' .....11

ఈ వారం కవిత్వం...12
ఆకాశం

బహుముఖ ప్రజ్ఞాశాలి.... 18

కథ..20
నువ్విచ్చిన జీవితం

సాహిత్యం.. 23
తెలుగుకూ తమిళ భావోద్విగ్నత...
పనినిబట్టి ఫలితం .... 24
అవగాహన అవసరం....... 28

ఇంకా...
మొగ్గ
వారఫలం
వగైరా..వగైరా..

## తాజా వార్తలు

### మాట్లాడటం మంచిది..



మహిళలు అందంగా, వినసొంపుగా మాట్లాడతారని అంటారు. ఈ విషయంలో నిజం ఎంతవరకు ఉంది? అని ఆరిజోనా యూనివర్సిటీ శాస్త్రవేత్తలు పరిశోధనలు చేసారు. ఆడవాళ్ల అయినా, మగవాళ్ల అయినా దాదాపు పాతికేళ్ల వచ్చేవరకు ఒక రోజులో సమానమైన పదాలను వినియోగిస్తారని తెలిపారు. ఆ తరువాత పాతికేళ్ల నుంచి అరవై నాలుగు సంవత్సరాలు వచ్చేంతవరకూ స్త్రీలు రోజూ మాట్లాడే మాటల్లో మగవాళ్లతో పోలిస్తే సుమారు మూడు వేల పదాలు ఎక్కువగా ఉంటాయని అధ్యయనాల్లో తేలింది. ఇలా ఎక్కువగా మాట్లాడటానికి కారణం సంతానం. సంతానాన్ని తీర్చిదిద్దుతూ, వారి బాగోగులను చూసే క్రమంలో మాటలు ఎక్కువవుతాయన్నమాట. పిల్లల బాధ్యతలు తీరిపోయే సమయానికి అంటే అరవై యేళ్ల దాటిన తరువాత స్త్రీలూ, పురుషులూ ఉపయోగించే పదాలు సమానంగా ఉంటున్నాయని తెలిసింది. నాలుగు దేశాలకు చెందిన మహిళలు, పురుషులను ఎన్నుకుని వారు మాట్లాడిన సుమారు ఏడు లక్షల రికార్డులని పరిశీలించిన తరువాత పరిశోధకులు ఈ విషయాలు వెల్లడించారు. ప్రతిరోజూ వ్యాయామం చేయడం ఎంత మంచి లక్షణమో– అదే విధంగా చక్కగా, వినసొంపుగా మాట్లాడటం కూడా ఆరోగ్య లక్షణమే.. అని శాస్త్రవేత్తలు సెలవిస్తున్నారు.

మీ రచనల్ని ఈ మెయిల్ చిరునామాకు పంపగలరు.
sunmagvaartha@gmail.com







# దోమల్ని స్టైల్‌గా తరిమి కొడదామా?



ఎవరిని పలరించినా డెంగ్యూ, మలేరియా జ్వరాలంటూ చెప్పేవారే! అవును మరి.. ఎక్కడైనా కాస్త తడి ఉంటే దోమలు చుట్టుముట్టేస్తాయి. ఇంట్లో ఉంటే మస్కిటో రెపల్లెంట్‌లు పెట్టో, దోమ తెరల మాటున దాక్కునో తప్పించుకోవచ్చు. మరి బయటకి వెళితే! ఇక పిల్లలతో వచ్చే తిప్పలు సరేసరి. దోమలున్నాయన్నా మాట వినరు. అందుకే వీటిని తెచ్చుకుంటే సరి. ఇవన్నీ దోమలను మన దగ్గరకు రానివ్వని 'యాంటీ మస్కిటో బ్రేస్‌లెట్లు. వీటిని చర్మానికీ ఆరోగ్యానికి హాని కలిగించని ఎసెన్షియల్ ఆయిల్‌తో నింపేస్తారు. కొన్నింటికి కొన్ని రోజులకోసారి లోపలి ఎసెన్షియల్ ఆయిల్‌ని రిప్లేస్ చేసుకోవాల్సి ఉంటుంది. ఇదంతా శ్రమ అనుకుంటే అల్ట్రాసోనిక్ రకాలను ఎంచుకోవచ్చు. వీటి నుంచి వచ్చే శబ్దంతో దోమలు పరారవుతాయి. వాచ్‌కీ యాక్సెసరీలకి అడ్డు అనిపిస్తే బటన్ రూపంలో ఉన్నవాటిని తెచ్చు కోండి. ఏదైనా సరే.. స్టైలిష్ లుక్ ఇవ్వడం ఖాయం. కార్టూన్ క్యారెక్టర్లతో వున్నవి పిల్లల్ని తెగ నచ్చేస్తాయి. ఇంకెందుకు ఆలస్యం.. ఆన్‌లైన్ వేదికల్లో వెతికేయండి మరి. కొత్త లుక్‌తో పాటు భద్రత కూడా లభిస్తుంది. భలే కాంబినేషన్ కదూ!







## ‘సంఘీ’ భావం



# రవాణా రంగంలో పెనుమార్పులు

మారుతున్న కాలానికి అనుగుణంగా త్వరితగతిన గమ్యానికి చేరడానికి ప్రజలు ఆసక్తి చూపుతున్నారు. ఛార్జీలు అధికంగా ఉన్నప్పటికీ గమ్యం చేరడం ప్రధాన లక్ష్యంగా మారింది. ఇందులో భాగంగానే వందే భారత్ రైళ్లు, బుల్లెట్ రైళ్లు వచ్చాయి. విమానాలకు కూడా నిత్యం రద్దీ పెరుగుతూనే ఉంది. విమానయానం చేసేవారి సంఖ్య గణనీయంగా పెరిగింది. ప్రస్తుతం మనకు నాలుగు రకాలైన ప్రయాణ సౌకర్యాలు ఉన్నాయి. రోడ్డు మార్గం, రైల్వేలు, ఆకాశమార్గం, సముద్రయానం వంటివి అందుబాటులో ఉన్నాయి. ప్రస్తుతం అయిదవ తరంగా హైపర్‌లూప్ వ్యవస్థ రూపుదిద్దుకుంటోంది. ఇది పూర్తి స్థాయిలో అందుబాటలో వస్తే విమానాల కంటే రెండు, మూడు రెట్లు వేగంగా గమ్యం చేరే అవకాశం కలుగుతుంది. గరిష్టంగా గంటకు 1200 కిలోమీటర్ల వేగంతో ఈ హైపర్‌లూప్ వాహనాలు గమ్యం చేరుకుంటాయి. వాహనమేదైనా ముందుకు కదలాలంటే చాలా గురుత్వాకర్షణ శక్తితోపాటు, గాలివేగం, పీడనం వంటి అనేక రకాల శక్తులను అధిగమించాలన్నది అందరికీ తెలిసిన విషయమే. ఈ పరిమితులేవీ లేని అంతరిక్షంలో అతితక్కువ ఇంధనంతోనే ఉపగ్రహాలు అతివేగంతో వెళతాయి. హైపర్‌లూప్ టెక్నాలజీ కూడా ఇలాంటిదే. కాకపోతే అంతరిక్షంలోని పరిస్థితులను కొద్దిగా మార్చి ఉపయోగిస్తారు. ముందుగా ఈ వ్యవస్థను ప్రపంచంలోనే అతిపెద్ద వ్యాపార దిగ్గజంగా పేరొందిన టెస్లా అధినేత ఎలాన్‌మస్క్ ప్రకటించారు. 2013లోనే మస్క్ ఈ వ్యవస్థ గురించి ప్రతిపాదించారు. అయితే ఈ వ్యవస్థపై అనేక అనుమానాలు ఉన్నాయని, వాస్తవ రూపం దాల్చే అవకాశమే లేదని వ్యాఖ్యానించారు. ఇంత వేగంగా వాహనం కదిలే పరిస్థితులు లేవని, ఒకవేళ సాధ్యపడినా అనేక ఇబ్బందులు ఉంటాయని పేర్కొన్నారు. అయితే మస్క్ ఈ అంశాన్ని సీరియస్‌గా తీసుకుని అధ్యయనాలు నిర్వహించి దానిని కార్యాచరణలో పెట్టారు. ప్రస్తుతం మన దేశంలో కూడా మద్రాస్ ఐఐటి బృందం హైపర్‌లూప్ వ్యవస్థను విజయ వంతంగా రూపకల్పన చేసింది. సుమారు నాలుగు వందల కిలోమీటర్ల మేర ఒక మార్గాన్ని ఏర్పాటు చేసి విజయం సాధించారు. దీనికి కేంద్ర ప్రభుత్వ ఆమోదంతో పాటు రైల్వే శాఖ నుంచి నిధులు అందించారు. ఈ వ్యవస్థ విజయవంతం అయిందని రైల్వే శాఖ మంత్రి అంజనీ వైష్ణవ్ ఇటీవల ట్విట్టర్‌లో ప్రకటించారు. ప్రయోగాత్మకంగా న్యూఢిల్లీ నుంచి జైపూర్‌కు హైపర్‌లూప్ మార్గాన్ని ఏర్పాటు చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఈ వ్యవస్థ అందుబాటులోకి వస్తే హైదరాబాద్ నుంచి తిరుపతికిగానీ, విశాఖపట్నానికిగానీ కేవలం 30 నిమిషాల వ్యవధిలోపే వెళ్లే అవకాశం ఉంటుంది. హైపర్‌లూప్ మార్గాన్ని ఏర్పాటుచేయడానికి సాధారణ రైల్వే మార్గం ఏర్పాటుకు అయ్యే ఖర్చు కంటే కేవలం పదవ శాతం ఖర్చుతో పూర్తి చేయవచ్చు. రైలు, రోడ్డు మార్గాల నిర్మాణానికి పెద్ద ఎత్తున భూసేకరణ చేయాల్సి ఉంటుంది. హైపర్‌లూప్ వ్యవస్థకు ఆ స్థాయిలో భూసేకరణ అవసరం ఉండదు. చిన్న చిన్న స్థంభాలు ఏర్పాటు చేసి దానిపై టన్నెల్ (గొట్టం) మార్గాన్ని ఏర్పాటుచేస్తారు. ఈ టన్నెల్ లోపల గాలి ఏమాత్రం ఉండకుండా శూన్యత ఏర్పడుతుంది. అందులో కాప్సుల్ వంటి వాహనాలను పంపుతారు. ఒక్కొక్క క్యాపుల్స్‌లో సుమారు 28 నుంచి 32 మంది కూర్చొనే వీలు కలుగుతుంది. వాయు వత్తిడి ఏమాత్రం లేకపోవడంతో అతివేగంగా ముందుకు కదలడానికి టన్నెల్ సంసిద్ధంగా ఉంటుంది. క్యాప్సుల్‌కు ముందు అత్యంత శక్తివంతమైన ఫ్యాన్‌ను ఏర్పాటు చేస్తారు. ఇది శూన్యం నుంచి అతితక్కువ మోతాదులో గాలిని సేకరించి క్యాప్సుల్ లోపలికి పంపించడంతో పాటు సదరు వాహనం వాయువేగంతో ముందుకు కదలడానికి దోహదం చేస్తుంది. అయితే ఈ వాహనం నేలపై అంటే క్యాప్సుల్ దిగువ భాగాన్ని తాకకుండా అర అంగుళం నుంచి అంగుళం ఎత్తులో ప్రయాణిస్తుంది. దీనివల్ల క్యాప్సుల్ ఎంతవేగంగా కదిలినా లోపల ఉండే ప్రయాణికులకు ఎలాంటి వత్తిడి గాని, కుదుపులుగాని ఉండవు. ప్రతి వంద కిలోమీటర్లకు ఒక ట్రాన్స్‌ఫార్మర్ లాంటి పరికరాన్ని అమర్చుతారు. ఇది వాహనం వేగాన్ని నియంత్రిస్తుంది. అతివేగంగా ముందుకు దూసుకుపోవడానికి, గమ్యం సమీపించే సమయంతో వేగం తగ్గించడానికి ఈ ట్రాన్స్‌ఫార్మర్లు పనిచేస్తాయి. అతివేగంగా వెళ్లినప్పటికీ ఇవి ప్రమాదాలకు గురికాకుండా ఉంటాయి. ఎందుకంటే ఒక టన్నెల్ వాహనం వెళ్లడానికి, మరో టన్నెల్ వాహనం రావడానికి వీలుగా తయారు చేస్తారు. దీనితో వాహనాలు ఎదురెదురుగా వచ్చి ఢీకొట్టే అవకాశం ఉండదు. ఈ క్యాపుల్స్ వంటి వాహనంలో కేవలం 28 నుంచి 32 మంది వరకు మాత్రమే ప్రయాణించడానికి అవకాశం ఉంటుంది. దీనితో ఒకదాని వెనుక మరొక దానికి పంపించే విధంగా ఏర్పాట్లు చేస్తారు. ముందుగా కొంత కాలం సరుకు రవాణాకు ఉపయోగించి ప్రయోగం ఫలవంతమైతే ప్రయాణి కులకు అనుమతి ఇచ్చే అవకాశం ఉంది. ఈ వ్యవస్థ అందు బాటులోకి వస్తే రవాణా రంగంలో పెనుమార్పులు వచ్చినట్లు భావించవచ్చు. ప్రస్తుతం జరుగుతున్న వేగవంతమైన ప్రయో గాలను పరిశీలిస్తే రెండు మూడేళ్లలో హైపర్‌లూప్ వ్యవస్థ ఉపరితల రవాణాలో కీలకపాత్ర పోషించే అవకాశం ఉంటుంది.

**– డాక్టర్ గిరీష్‌కుమార్ సంఘీ**

# ఆరోగ్యామృతం.. వైద్య పర్యాటకం

కవర్ స్టోరీ

షేక్ అబ్దుల్ హకీం జాని

**నేడు అత్యాధునిక వైద్య సదుపాయాలు పెరిగిపోయాయి. తక్కువ ఖర్చుతో మెరుగైన వైద్యం చేయించుకోవడానికి ప్రపంచంలోని అన్ని దేశాల ప్రజలు కోరుకుంటున్నారు. ఈ నేపథ్యంలో ఒక దేశం నుండి మరో దేశానికి వైద్య నిమిత్తం వెళుతున్న పర్యాటకుల సంఖ్య కూడా పెరిగిపోయింది. అత్యాధునిక వైద్య సదుపాయాలతో చక్కటి సంరక్షణ సేవలు అందించడం వలన మన దేశంలో వైద్య పర్యాటకం అభివృద్ధి చెందుతుంది. శరవేగంతో ఫార్మా రంగం అభివృద్ధి చెందడంతో మెడికల్ టూరిజం కూడా అదే స్థాయిలో ప్రపంచ ప్రజల్ని విశేషంగా ఆకర్షిస్తోంది.**

విదేశీ రోగుల రాకను మెడికల్ టూరిజం అని, మెడికల్ వాల్యూ ట్రావెల్ అని కూడా పిలుస్తుంటారు. ప్రధానంగా మూడు రకాల వైద్య చికిత్సల కోసం విదేశీ రోగులు ఎక్కువసంఖ్యలో భారత్‌కు వస్తున్నారు. సర్జరీలు, అవయవ మార్పిడి, కీళ్ల మార్పిడి, కేన్సర్, ఇతర దీర్ఘకాలిక వ్యాధులకు చికిత్సలను క్యూరేటివ్ మెడికల్ ట్రీట్ మెంట్ అంటారు. ఇటువంటి చికిత్సల కోసం విదేశాల నుండి వైద్య నిమిత్తం వచ్చిన వారికి తక్కువ ఖర్చుతో అత్యాధునికమైన మెరుగైన వైద్యం ఇక్కడ లభిస్తుంది. ఆ కారణంగా పలు దేశాల ప్రజల్ని మనదేశ వైద్య పర్యాటకం విశేషంగా ఆకర్షిస్తుంది.



ముఖ్యంగా హైదరాబాద్, బెంగళూరు, ముంబై, చెన్నై, ఢిల్లీ, కేరళలోని అలెప్పీ, కొచ్చి, కోల్‌కతా, నోయిడాలోని ఫోర్టిస్ హాస్పిటల్, గుర్గావ్‌లోని మాక్స్ హెల్త్ కేర్ ఇత్యాది అనేక నగరాలలో తక్కువ ఖర్చుతో లభిస్తున్న మెరుగైన వైద్యం కారణంగా విదేశాల నుండి చికిత్స నిమిత్తం వస్తున్న పర్యాటకుల సంఖ్య నానాటికీ గణనీయంగా పెరిగిపోతోంది. అందువల్ల నేడు మన దేశంలో వైద్య పర్యాటకం ఊపందుకుంటుంది.

అత్యాధునిక వైద్యం అంటే అభివృద్ధిలో ముందంజలో ఉన్న అమెరికాతో పాటు యూరప్ దేశాలలోనే లభిస్తుందని కొందరు భ్రమ పడుతుంటారు. కొదవలేని మానవ వనరులు, రక్షణ కల్పించే శాంతి భద్రతలు, సకాలంలో అందించే మెరుగైన వైద్యం ఇత్యాది అనేక అంశాల వల్ల మన దేశం పర్యాటక వైద్యానికి కేంద్ర బిందువుగా మారుతోంది. గత పదేళ్లుగా చూసుకుంటే హైదరాబాద్‌లోని ఆస్పత్రులకు విదేశాల నుండి వైద్య నిమిత్తం వస్తున్న పేషెంట్ల తాకిడి ఎక్కువైంది. ఆఫ్రికా దేశాలైన నైజీరియా, సూడాన్, మిడిలీస్ట్ దేశాలు ఒమన్, ఇరాక్, యెమన్, ఇటు పొరుగు దేశాలైన బంగ్లాదేశ్, నేపాల్, ఆఫ్ఘనిస్తాన్ నుంచి కూడా రోగులు హైదరాబాద్ ఆస్పత్రులకు క్యూ కదుతున్నారు. అటు సంపన్న దేశాలైన అమెరికా, కెనడా, బ్రిటన్, రష్యా, ఆస్ట్రేలియా, చైనా వంటి దేశాల నుంచి కూడా మన వైద్యనిమిత్తం పర్యాటకులు హైదరాబాద్‌కు వస్తున్నారు.

భారత్‌కు వైద్య నిమిత్తం విదేశీ పర్యాటకులు గత మూడేళ్లుగా ఇండియన్ మెడికల్ టూరిజం గణనీయంగా పెరిగింది. వైద్య చికిత్సల కోసం వచ్చే విదేశీయుల సంఖ్య 2020లో 1,83,000గా ఉంటే, 2021లో 3,04,000కి చేరుకుంది. దీన్ని బట్టి దేశంలో మెడికల్ టూరిజం ఎంత వేగంగా అభివృద్ధి చెందిందో అర్థమవుతోంది. 2020-2021 వైద్య పర్యాటక సూచీని పరిశీలించి నట్లైతే ప్రపంచ వ్యాప్తంగా 46 దేశాల్లో ఈ విధంగా పర్యాటకుల్ని ఆకర్షించడంలో మన దేశం పదో స్థానంలో ఉంది. వైద్య చికిత్సల కోసం మన దేశానికి 2014లో లక్షా పాతికవేలు వస్తే, 2021 నాటికి ఈ సంఖ్య మరింత పెరిగినట్లు అప్పట్లో గోవాలో జరిగిన జీ20 ఆరోగ్య కార్యవర్గ సమావేశంలో కేంద్ర పర్యాటక మంత్రిత్వ శాఖ వెల్లడించింది. ఆ తరువాత ఢిల్లీ నగరంలో జీ20 శిఖరాగ్ర సమావేశంలో వైద్య పర్యాటకం ఒక్కో మెట్టు అధిగమిస్తూ సాధిస్తున్న అభివృద్ధిని వెల్లడించారు. మెడికల్ టూరిజం మార్కెట్ 2023 నుంచి 2027 మధ్య 20 శాతం కంటే ఎక్కువ నమోదు కావచ్చని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

## వైద్య టూరిజం హబ్‌గా హైదరాబాద్

వైద్య టూరిజంకు హైదరాబాద్ హబ్‌గా రూపొందుతోంది. దేశంలోని బెస్ట్ హాస్పిటల్ ఉన్న నగరాల జాబితాలో హైదరాబాద్ టాప్ ఫైవ్‌లో నిలిచింది. తక్కువ ఖర్చుతోనే మెరుగైన వైద్యం కావాలనుకునే విదేశీ మెడికల్ టూరిస్టులు ఇప్పుడు

హైదరాబాద్ వైపు చూస్తున్నారు. ఇప్పటికే హైదరాబాద్‌లో ఐటీ దిగ్గజ కంపెనీలన్నీ కొలువు దీరాయి. అదే రీతిలో రాకెట్ వేగంతో ఫార్మా ఇండస్ట్రీ అభివృద్ధి చెందుతుంది. విదేశాల్లో కూడా సాధ్యం కాని ఎన్నో క్లిష్టమైన సర్జరీలను ఇక్కడి ఆసుపత్రులు విజయవంతంగా చేసి చూపించాయి. ద్వితీయ శ్రేణి



నగరాలైన పూణె, కొచ్చిన్, అహ్మదాబాద్ లాంటి నగరాల్లో ఇప్పుడిప్పుడే మెడికల్ టూరిజం అభివృద్ధి చెందుతోంది. దేశ ఆర్థిక వ్యవస్థలో మెడికల్ టూరిజం కీలక పాత్ర పోషిస్తోంది. ప్రస్తుతం దాదాపు 80 దేశాల నుంచి 20 లక్షల మందికి పైగా రోగులు ప్రతి ఏటా చికిత్స కోసం భారత్‌కు వస్తున్నారని అంచనా. ఐదేళ్ల క్రితం వరకు చెన్నై నగరానికి మెడికల్ హబ్ ఆఫ్ ఇండియాగా గుర్తింపు ఉండేది.

ఇప్పుడు హైదరాబాద్‌లోని వాతావరణ పరిస్థితులు, ఇతర దేశాలకు పెరిగిన విమాన సర్వీసుల కారణాలతో చెన్నై నగరానికి హైదరాబాద్ గట్టి పోటీ నిస్తోంది. మెడికల్ టూరిజం కోసం హైదరాబాద్ ప్రాధాన్యత పెరగడానికి అనేక బలమైన కారణాలు ఉన్నాయి. అపార అనుభవం కలిగిన వైద్య నిపుణులు అందుబాటులో ఉండటం, ఆరోగ్య సంరక్షణ సిబ్బంది ఆంగ్లంలో మాట్లాడటం, ఇతర దేశాల భాషలను అనువదించి చెప్పే సిబ్బంది, తక్కువ వ్యయంతో వైద్యం, వేగంగా చికిత్సలు అందించడం, అత్యాధునికమైన సాంకేతిక పరిజ్ఞానంతో అంతర్జాతీయ ప్రమాణాలు కలిగిన వైద్య సేవలు ఇత్యాది అనేక అంశాలు వైద్య పర్యాటకం దినదినాభివృద్ధి చెందడానికి దోహదపడు తున్నాయి.



కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ నిర్వహించిన ఒక అధ్యయనంలో ఆసక్తికర విషయాలు వెల్లడయ్యాయి. చికిత్స కోసం హైదరాబాద్‌కు వచ్చే విదేశీయులు ఒక్కొక్కరు సగటున 3,000 డాలర్ల నుండి 10,000 డాలర్ల వరకు ఖర్చు చేస్తున్నారని అంచనా. ఇది స్థానిక ఆర్థిక వ్యవస్థను కొంత మెరుగుపరుస్తోంది. హైదరాబాద్‌లోని ఆరోగ్య సంరక్షణ సౌకర్యాలు గత ఐదేళ్లలో ఏకంగా 40 శాతం వృద్ధిని సాధించడం విశేషం. ఇది మెడికల్ హబ్ హైదరాబాద్కు పెరుగుతున్న గుర్తింపును సూచిస్తోంది. కేంద్ర పర్యాటక మంత్రిత్వ శాఖ సమాచారం ప్రకారం దేశంలోకి వచ్చే మొత్తం మెడికల్ టూరిస్టుల్లో సుమారు 30 శాతం మంది హైదరాబాద్‌లో వైద్య సేవలు పొందుతున్నారు. ప్రముఖ మెడికల్ టూరిజం ఏజెన్సీ నిర్వహించిన సర్వేలో యునైటెడ్ స్టేట్స్, నైజీరియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ వంటి దేశాలకు చెందిన రోగులు హైదరాబాద్‌లోని అధునాతన మౌలిక సదుపాయాలు, నైపుణ్యం కలిగిన వైద్య నిపుణులు, తక్కువ ఖర్చుతో అందించే వైద్య చికిత్సల కోసం హైదరాబాద్‌కు రావడానికి ఇష్టపడతారని నివేదికలు చెబుతున్నాయి.

అమెరికా వంటి సంపన్న దేశాల్లో వైద్య చికిత్సల ఖర్చులతో పోల్చితే ఇక్కడ ఖర్చులు తక్కువ కావడంతో ఆ దేశాలకు చెందిన రోగులు కూడా హైదరాబాద్‌కు వస్తున్నారు. చాలా వరకు సంపన్న దేశాల్లో వైద్య చికిత్సకు అయ్యే ఖర్చుతో పోలిస్తే హైదరాబాద్‌లో 70 శాతం మేర తక్కువగా ఉండటం విశేషం.

మెడికల్ హబ్ హైదరాబాద్ ఎదగడానికి నిజాం కాలంలోనే బీజం పడింది. నిజాం రాజవంశం కాలంలోనే హైదరాబాద్ వైద్య విశిష్ట కేంద్రంగా ఖ్యాతి గడించింది. నిజాం కాలంలోనే హైదరాబాద్‌లో ప్రతిష్టాత్మకమైన ఉస్మానియా జనరల్ హాస్పిటల్ సహా పలు ప్రముఖ ఆసుపత్రులు ఏర్పాటు అయ్యాయి. అప్పట్లో యునాని వైద్యానికి కూడా హైదరాబాద్ ప్రసిద్ధి చెందింది. భారతదేశంలో మొట్టమొదటి ఆధునిక ఆరోగ్య సంరక్షణ సంస్థల స్థాపనకు హైదరాబాద్ నిలయంగా నిలిచింది. అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన హెల్త్ కేర్ వసతులు హైదరాబాద్‌లో కాలాను గుణంగా అప్‌గ్రేడ్ అవుతూ వచ్చాయి. అందుకే ఆరోగ్య సంరక్షణ పరిశ్రమలో హైదరాబాద్‌ను అగ్రగామిగా నిలవడం వెనుక శతాబ్దాలకు పైగా కృషి ఉంది.

## తక్కువ ఖర్చుతో కూడిన చికిత్సలు

మెడికల్ టూరిజం కోసం హైదరాబాద్‌ను ఎంచుకోవడంలో ప్రధాన ప్రయోజనాల్లో ఒకటి తక్కువ ఖర్చుతో చికిత్సలు, పాశ్చాత్య దేశాలతో పోల్చితే హైదరాబాద్‌లో వైద్య విధానాల ఖర్చుచాలా తక్కువగా ఉంటాయి. మెరుగైన వైద్యం అందించడంలో రాజీ లేదు, రోగులు చికిత్సలపై విదేశాలతో పోల్చితే, 60-80 శాతం వరకు ఆదా చేయవచ్చు. తక్కువ ఖర్చుతో ఆరోగ్య సంరక్షణ పొందాలనుకునే వారికి హైదరాబాద్ ఉత్తమ ఎంపిక.

## ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలు

ప్రపంచంలోనే అత్యుత్తమమైన ఆరోగ్య సంరక్షణ మౌలిక సదుపాయాలు హైదరాబాద్‌లో అందుబాటులో ఉన్నాయి. అందుకే ఈ నగరం అనేక బహుళస్పెషాలిటీ ఆసుపత్రులకు నిలయంగా మారింది. అత్యాధునిక సాంకేతికతతో అత్యంత నైపుణ్యం కలిగిన వైద్య నిపుణులతో కూడి సిబ్బంది అందుబాటులో ఉన్నారు. ఈ ఆసుపత్రులు సంక్లిష్ట శస్త్రచికిత్సల నుండి అధునాతన రోగ నిర్ధారణ, నివారణ సంరక్షణ వరకు అనేక రకాల చికిత్సలను అందిస్తున్నాయి. హైదరాబాద్ గొప్ప సాంస్కృతిక వారసత్వం, నిర్మలమైన ప్రకృతి దృశ్యాలు, చక్కటి వైద్యంతో త్వరగా కోలుకోవడానికి అనుకూలమైన వాతావరణం కలిగి ఉండటం విశేషం. ప్రశాంతమైన పరిసరాలతో శారీరక వైద్యం మాత్రమే కాకుండా మానసిక, భావోద్వేగ పునరుజ్జీవనాన్ని కోరుకునే వ్యక్తులకు సరైన ప్రాంతంగా హైదరాబాద్ అభివృద్ధి చెందుతూ వచ్చింది.



## నిపుణులైన వైద్య బృందం

ప్రఖ్యాత అంతర్జాతీయ సంస్థలలో శిక్షణ పొందిన నిష్ణాతులైన వైద్య నిపుణులు హైదరాబాద్లో చికిత్స అందిస్తు న్నారు. వారి నైపుణ్యం, రోగికి చికిత్స అందించడంతో పాటు వారిని ఆదరించే విధానం హైదరాబాద్కు వచ్చేవారి సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. వీటికితోడు సంప్రదాయ భారతీయ వైద్య పద్ధతులు, ఆధునిక వైద్యం మిశ్రమం ఆరోగ్య సంరక్షణ మెడికల్ టూరిజానికి ఊతమిస్తున్నాయి.

## సరైన సమయంలో చికిత్స

సాధారణంగా వైద్య ప్రక్రియల కోసం రోగులు ఎక్కువసేపు వేచి ఉండటం కొంత నిరాశ కలిగిస్తుంది. సరియైన సమయంలో చికిత్స అందకపోతే కొన్ని సందర్భాల్లో ప్రాణాలకే హాని కలిగిస్తుంది. అనేక అభివృద్ధి చెందిన దేశాలతో పోల్చితే చికిత్సల కోసం వేచి చూడాల్సిన సమయం ఇక్కడ చాలా తక్కువగా ఉన్నందున విదేశీయులు కూడా హైదరాబాద్ వైపు మొగ్గు చూపుతున్నారు. రోగులకు సకాలంలో వైద్యం అందించడంలో హైదరాబాద్ ఆసుపత్రులు ముందుంటున్నాయి. దీంతో త్వరగా కోలుకుని వారి రోజు వారీ జీవితాలకు తిరిగి చేరుకుంటున్నారు. సకాలంలో చికిత్స అందించడం ద్వారా రోగులు త్వరగా కోలుకుని మామూలు స్థితికి చేరుకోగలుగుతున్నారు. హైదరాబాద్‌లో లభిస్తున్న అనేక వైద్య సేవల పట్ల విదేశీయులు మొగ్గు చూపుతున్నారు. ఆ కారణంగా విదేశీయులు క్యూ కట్టడంతో వైద్య టూరిజం బాగా అభివృద్ధి చెందింది. మెడికల్ టూరిస్టులు ఎక్కువగా బోన్ మారో ట్రాన్స్ ప్లాంట్, కార్డియాక్ బైపాస్, కంటి శస్త్రచికిత్స, మోకాలి మార్పిడి, ఆయుర్వేదం వంటి భారతీయ సంప్రదాయ వైద్య చికిత్సలు, సంతాన సాఫల్యం చికిత్స (ఐవీఎఫ్) కోసం హైదరాబాద్‌కు వస్తున్నారు. ప్రపంచ స్థాయి ప్రమాణాలు, అత్యాధునిక వైద్యపరికరాలు, నిష్ణాతులైన వైద్యులు వెరసి హైదరాబాద్ మెడికల్ టూరిజం హబ్‌గా మారుతోంది.

**ఆర్థోపెడిక్స్:** జాయింట్ రీప్లేస్‌మెంట్, వెన్నెముక శస్త్రచికిత్సతో సహా, ఎముకలు, కీళ్ల సంబంధిత రుగ్మతలకు వినూత్న పరిష్కారాలను అందిస్తూ, ఎముకల చికిత్సలకు హైదరాబాద్ కేంద్రంగా ఉంది. మినిమల్లీ ఇన్వాసివ్ సర్జరీలు, జాయింట్ రీప్లేస్ మెంట్లు, స్పోర్ట్స్, మెడిసిన్స్ దృష్టి సారించడంతో, ఆర్థోపెడిక్ వ్యాధుల నుండి ఉపశమనం పొందాలనుకునే వ్యక్తుల కోసం హైదరాబాద్ మెడికల్ హబ్‌గా మారింది.

**కార్డియాలజీ:** ఈ విభాగంలో హైదరాబాద్ నైపుణ్యం కలిగిన చికిత్స అందించేందుకు ప్రసిద్ధి చెందింది. అధిక సక్సెస్ రేట్లతో పాటు అధునాతన కార్డియాక్ కేర్‌కు ప్రసిద్ధి. ప్రత్యేక ఆసుపత్రులు, క్లినిక్‌లు అధునాతన గుండె సంరక్షణను అందిస్తున్నాయి. యాంజియోప్లాస్టీ, బైపాస్ సర్జరీల నుండి నాన్‌ఇన్వాసివ్ ప్రక్రియల వరకు గుండె సమస్యలు ఉన్న వ్యక్తులు అత్యంత నైపుణ్యం కలిగిన కార్డియాలజిస్టుల సంరక్షణలో ప్రపంచ స్థాయి చికిత్సలు పొందుతున్నారు.

**కాస్మెటిక్, ప్లాస్టిక్ సర్జరీ:** రినోప్లాస్టీ, లైపోసక్షన్, ఫేస్‌లిఫ్టులు వంటి కాస్మెటిక్, ప్లాస్టిక్ సర్జరీ విధానాలను కోరుకునే వ్యక్తులకు హైదరాబాద్ ఒక ముఖ్య కేంద్రంగా నిలిచింది. అనుభవజ్ఞులైన ప్లాస్టిక్ సర్జన్లు, అత్యాధునిక సౌకర్యాలతో, రైనోప్లాస్టీ, లైపోసక్షన్, బ్రెస్ట్ బలోపేతంతో సహా మరెన్నో రకాల సేవలను అందిస్తుంది. సహజంగా కనిపించే ఫలితాలు, వ్యక్తిగత సంరక్షణకు అధిక ప్రాధాన్యత హైదరాబాద్ సౌందర్య శస్త్రచికిత్స రంగంలో ప్రత్యేకంగా నిలిపింది.

**ఆంకాలజీ:** ఆధునిక పద్ధతులతో సమగ్ర కేన్సర్ చికిత్స, సమగ్ర కేన్సర్ సంరక్షణను అందించే ప్రముఖ ఆంకాలజీ కేంద్రాలకు హైదరాబాద్ నిలయం. అత్యాధునిక సౌకర్యాలు, అధునాతన రేడియేషన్ థెరపీ, వ్యక్తిగత చికిత్స ప్రణాళికలు రోగులు కేన్సర్

నుంచి విముక్తి పొందేలా చేస్తున్నాయి. ఆయుర్వేదం వంటి సంప్రదాయ భారతీయ వైద్యం కేన్సర్ చికిత్సకు సమగ్ర విధానాన్ని మరింత మెరుగుపరుస్తుంది.

## భారత్‌లో సంప్రదాయ వైద్య చికిత్స

సరోగసి వంటి సంతానోత్పత్తి చికిత్సలు, కాలేయం, మూత్రపిండాలు, ఇతర అవయవ మార్పిడి ఇత్యాది వాటికి అద్భుతమైన చికిత్సలు భారత్‌లో లభిస్తున్నాయి. వైద్య పర్యాటకం కోసం మన దేశానికి అనేక విదేశాల నుండి పర్యాటకులు వస్తున్నారు. అటువంటి వారికి కేంద్ర హోంశాఖ వీసాల మంజూరులో సడలింపులు ఇస్తోంది. 'ఆయుష్ వీసా' పేరుతో వీరికి వీసాలు జారీ చేస్తుంది. పలు రుగ్మతలతో వైద్య చికిత్స కోసం యోగా థెరపీ కోసం మన దేశానికి వచ్చేవారికి వీసా నిబంధనలను సరళీకృతం చేశారు. ప్రాకృతిక చికిత్సను ప్రపంచానికి చాటి చెప్పేందుకు కృషి జరుగుతుంది అనాదిగా ప్రాకృతిక విధానంలో చికిత్స చేసే అనేక వైద్య కేంద్రాలు కేరళలో అధికంగా ఉన్నాయి. ఆయుర్వేదం, యోగా, ప్రకృతివైద్యం, యునాని, సిద్ధ, హోమియోపతి వంటి సంప్రదాయ వైద్య చికిత్సల కోసం ఎక్కువ మంది విదేశీ రోగులు భారత్‌కు వస్తున్నారు. అయితే దక్షిణాదిలో టాప్ మెడికల్ టూరిస్ట్ డెస్టినేషన్స్ మారుతున్న నగరాలు కొన్ని వున్నాయి. వైద్య ప్రమాణాలు ఎంతో మెరుగు పడ్డాయి. దీంతో ఇటీవల కాలంలో విదేశాలకు చెందిన రోగులు చికిత్సల కోసం మన దేశానికి భారీగా క్యూ కడుతున్నారు.

**అలెప్పి:** కేరళలోని అల్లెప్పి మెడికల్ టూరిజం హాట్ స్పాట్‌గా గుర్తింపు పొందింది. ఆయుర్వేద చికిత్సల ద్వారా పునరుజ్జీవనం కోసం విదేశీ రోగులు ఎక్కువగా కేరళ రాష్ట్రంలోని ఈ నగరానికి వస్తుంటారు. ఇక్కడ చికిత్సా విధానం పర్యావరణ అనుకూలంగా ఉంటుంది. దీనికి తోడు కోవిడ్ తర్వాత సంపూర్ణ ఆరోగ్య సంరక్షణ మెరుగుదలను లక్ష్యంగా చేసుకునే ఆయుష్ (ఆయుర్వేదం, యోగా, వేచురోపతి, యునాని, సిద్ధ, హెమియోపతి) వైద్య విధానంలో పెరుగుదల నమోదైంది. ఆయుష్ అనేది ఆగ్నేయాసియాలో ప్రధానంగా అభ్యసించే భారతీయ వైద్య విధానం, భారతదేశం అతిపెద్ద కేంద్రాలలో ఒకటి. ఆయుష్ మనస్సు, శరీరం, ఆత్మ సమతుల్యతను సాధించడంలో సహాయపడుతుంది. ఈ సంపూర్ణ విధానం రోగులకు వైద్యం చేయడానికి మరింత సమగ్రమైన విధానాన్ని అందిస్తోంది.



**చెన్నై:** తమిళనాడు రాజధాని చెన్నై 'హెల్త్ క్యాపిటల్ ఆఫ్ ఇండియా' అని పిలుస్తారు. వివిధ రకాల వైద్య చికిత్సల కోసం దేశంలో అత్యంత రద్దీ ఉండే డెస్టినేషన్‌లలో చెన్నై ఒకటి. కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీస్ డేటా ప్రకారం అత్యుత్తమ స్థాయి వైద్య చికిత్స కోసం దాదాపు 40 శాతం మంది రోగులు చెన్నైకే ఓటు వేశారు. ప్రధానంగా కార్డియాక్ బైపాస్, తుంటి మార్పిడి, ఎముక మజ్జ మార్పిడి, కంటి శస్త్రచికిత్సల కోసం ప్రతి యేటా దాదాపు వేలాది మందికి పైగా విదేశీ రోగులు చెన్నైకి వస్తుంటారు. అందుకే చెన్నై నగరాన్ని 'భారతదేశ ఆరోగ్య రాజధాని' అని పిలుస్తారు. నగరం అంతటా ఉన్న బహుళ, సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులకు ప్రతిరోజూ 150 మంది వరకు విదేశీయులు వైద్య నిమిత్తం వస్తున్నారు. విదేశాల నుండి మన దేశానికి వచ్చే ఆరోగ్య పర్యాటకుల్లో 45 శాతం మందిని, దేశీయ ఆరోగ్య పర్యాటకుల్లో 30 నుండి 40 శాతం మందిని చెన్నై నగరం విశేషంగా ఆకర్షిస్తోంది. నగరంలోకి వచ్చే పర్యాటకుల ప్రవాహం వెనుక పలు కారణాలు ఉన్నాయి.





తక్కువ ఖర్చుతో మెరుగైన వైద్యం, స్వల్పమైన వేచి ఉండే సమయం, నగరంలోని స్పెషాలిటీ హాస్పిటల్స్ అందించే సౌకర్యాలు ముఖ్యమైనవిగా చెప్పవచ్చు.

**కోయంబత్తూరు:** తమిళనాడులో చెన్నై తరువాత అంతటి స్థాయిలో వైద్యానికి ప్రసిద్ధి చెందింది కోయంబత్తూరు. ఇక్కడ వైద్య ఖర్చులు కూడా అనువుగా ఉంటాయి. కొన్ని రకాల బెస్ట్ మెడికల్ సదుపాయాలకు ఈ నగరం నిలయంగా ఉంది. అల్లోపతితో పాటు సిద్ధ, ఆయుర్వేదం, యునాని, హోమియోపతి, ఈఎన్‌టీ, వెల్నెస్ వంటి చికిత్సల కోసం విదేశీ రోగులు ఈ నగరానికి ఎక్కువగా వస్తుంటారు.

**బెంగళూరు:** భారత్‌లో అత్యుత్తమ వైద్య చికిత్స కోసం విదేశీ రోగులు ఎంపిక చేసుకునే నగరాల్లో బెంగళూరు ముందు వరుసలో ఉంది. ప్రపంచం నలుమూలల నుంచి రోగులు ఇక్కడికి వస్తుంటారు. హై క్వాలిఫైడ్ మెడికల్ ప్రొఫెషనల్స్, రీసెర్చ్ టీము బెంగళూరు నిలయంగా ఉంది. తక్కువ మెడికల్ ఛార్జీలతో నాణ్యమైన వైద్య సేవలు లభించడంతో విదేశీయులు ఈ నగరానికి వరుస కడుతున్నారు.

**ముంబై:** కార్డియాలజీ, ఆంకాలజీ, కాస్మెటిక్ సర్జరీలో విస్తృతమైన వైద్య సేవలను ముంబై ఆసుపత్రుల్లో అందిస్తుంది.

**న్యూఢిల్లీ:** దేశంలోని కొన్ని అగ్రశ్రేణి ఆసుపత్రులు, ఆరోగ్య సంరక్షణ సంస్థలకు నిలయంగా ఢిల్లీ నగరం భాసిల్లుతుంది. సమగ్ర వైద్య చికిత్సలు ఇక్కడ లభిస్తున్నాయి. మన దేశంలో వైద్య పర్యటన అభివృద్ధి చెందడంతో విదేశీయుల రాకపోకలు కూడా ఎక్కువయ్యాయి. తత్ఫలితంగా ఆదాయం పెరగడంతో పాటు నూతన ఉద్యోగ అవకాశాలు కూడా పెరిగాయి. ప్రభుత్వాలు సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులు మంజూరు చేసిన కారణంగా వైద్య సేవలు మరింతగా మెరుగు పడ్డాయి. తెలంగాణలోని ఆదిలాబాద్, వరంగల్ మొదలైన చోట్ల సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులు ఏర్పాటు చేశారు. పిల్లల విభాగంతో పాటు మోకాలి కీళ్ల శస్త్ర చికిత్స, అవయవాల మార్పిడి ఇత్యాది వైద్య సేవలు అందుబాటులోకి వచ్చాయి. వీటితో పాటు నూతన వైద్య కళాశాలలు పెద్ద ఎత్తున ఏర్పాటు చేస్తున్నారు. జిల్లాకొక బోధనాసుపత్రి చొప్పున ఏర్పాటు చేయాలని ప్రతిపాదనలు ఉన్నాయి. పలు ప్రైవేటు వైద్య కళాశాలలకు అనుమతి ఇవ్వడంతో పెద్ద ఎత్తున వాటి నిర్మాణం కొనసాగుతోంది.



ఒకవైపు వైద్య కళాశాలల నిర్మాణం, మరోవైపు అత్యాధునిక వైద్య సేవలతో శరవేగంతో నిర్మిస్తున్న ఆసుపత్రులు ఇత్యాది అంశాలు మన దేశంలో వైద్య పర్యాటకం అభివృద్ధి చెందడానికి దోహద పడుతున్నాయి. ఈ నేపథ్యంలో అనేక సవాళ్లను



ఎదుర్కోవలసి ఉంది. ఆరోగ్య సంరక్షణ సౌకర్యాలు కల్పించడంలో ఎక్కడా రాజీ పడకుండా నాణ్యత విషయంలో పూర్తిస్థాయి హామీ లభించేలా కృషి చేయడం, పెరుగుతున్న వైద్య పర్యాటకానికి అనుగుణంగా ఆరోగ్య సంరక్షణ మౌలిక సదుపాయాలపై అవసరమైన పెట్టుబడులను సమకూర్చడం, నైతిక ప్రమాణాలు, నాణ్యమైన వైద్యం పట్ల అంతర్జాతీయ రోగులకు విశ్వాసాన్ని కలిగించడం ఇత్యాది విషయాలపై దృష్టి సారించాలి.

మన దేశంలో ఉన్న వనరులతో పాటు అందివచ్చిన అవకాశాలను రాష్ట్ర ప్రభుత్వాలు సద్వినియోగం చేసుకుని మెరుగైన వైద్య, ఆరోగ్య సంరక్షణ సేవలు అందించి విదేశీయుల్ని ఆకట్టుకోగలిగితే వైద్య పర్యాటకం మరింత మెరుగుపడి మన దేశానికి కీర్తి ప్రతిష్ఠలు లభించడంతో పాటు ఇక్కడి ప్రజలకు మెండుగా ఉపాధి అవకాశాలు దొరుకుతాయి.

కథ

# మానవ సం'బంధాలు'

చలపాక ప్రకాష్

ఆ ఇంటి ముందు ఉన్న కాలింగ్ బెల్ నొక్కాడు రమేష్. "ఎవరూ?" అంటూ లోపలి నుండి ఒక యువతి గొంతు.

"నా పేరు రమేష్ అండీ! రామ్మోహన్ గారిని చూడడానికి వచ్చానండీ!" చెప్పాడతను..

లోపలి నుండి ఓ యువతి వచ్చి గేటుకు వేసిన తాళం తీస్తూ అంది "ఇంతక్రితమే డాక్టరుగారి వచ్చి నాన్నగారిని చూసి వెళ్ళారండీ.. ఆయన మగతగా పడుకున్నారు" అంది ఆ యువతి. ఆమె పేరు సంధ్య, రామ్మోహన్ గారి ఒక్కగానొక్క కూతురామె.

"సరేనండీ.. మళ్లీ వస్తాను.." అంటూ అతను వెను తిరిగేలోపే లోపలి నుండి ఓ మగ కంఠం లోగొంతుతో "ఎవరమ్మా?" అని అడిగారు సంధ్యని.

"రమేష్ అంకుల్ వచ్చారు డాడీ.." అంటూ– "నాన్నగారు లేచినట్లున్నారు.. మీరు వెళ్ళి చూడండి" అంది తిరిగి రమేష్.

లోపలి గదిలోకి అడుగు పెట్టాడు రమేష్, ఒకప్పుడు ఆ ఇంటి వరండా నిండా అనేకమంది నాటక సమాజాలవారు, సాహిత్య సాంస్కృతిక సంస్థల వాళ్ళతో కిటకిటలాడేది. రామ్మోహన్ గారు ఒకప్పుడు కమర్షియల్ టాక్స్ ఆఫీస్‌లో ఓ ఉన్నత ఉద్యోగిగా పని చేసి రిటైర్ అయ్యారు. మొహం నిండా స్ఫోటక మచ్చలతో భయంకరంగా కనిపించే రామ్మోహన్ గారిని మొదటిసారి చూస్తే ఎవరైనా భయపడవలసిందే. కానీ ఆయన మనసు వెన్న అని ఆయనతో కలిసి పని చేసేవారికే తెలుస్తుంది. ఆయన ఉద్యోగంలో ఉన్నప్పటి నుండీ ఆయనలో ఉన్న కళారాధన పెల్లుబికి అనేక సాంస్కృతిక సంఘాలతో అవినాభావ సంబంధాలు ఏర్పరుచుకునేవారు. ఆయనలో ఉన్న ఆ అభిరుచే అనేక సమాజాలకు ఆయన అధ్యక్షులుగా ఉంటూ భారీ దానం చేసేవారు. చిన్న చిన్న సభల నుండి భారీ కార్యక్రమాలన్నీ తన ఒంటి చేత్తో నిర్వహించేవారు. ఆ విధంగా నగరంలో ఏ సాంస్కృతిక కార్యక్రమం జరిగినా ఆ సంస్థవారు ఆర్థిక సహాయం కోసం రామ్మోహన్ ఇంటి ముందు క్యూ కట్టేవారు. తన దగ్గర డబ్బు ఉన్నా లేకున్నా వచ్చిన వారికి కాదనకుండా డబ్బు ఇచ్చి, లేకుంటే మాట సాయమైనా చేసి దానిని ఎలాగైనా నిలుపుకునేవారు. అందుకే అనేక సంస్థలకి ఆయనంటే అమిత ప్రేమ. ఒక్క మాటలో చెప్పాలంటే ఆయన ఆ సంస్థలకు ఓ పెద్ద దిక్కు కూడానూ. ఆయన లేకుండా ఏ వేదిక పైనా ఏ కార్యమం జరిగేది కాదు. ఆయనకు, సంస్థలకు మధ్య అవినాభావ సంబంధం అంతగా పెనవేసుకుపోయింది. అటువంటి రామ్మోహన్ రావు గారికి పోఠాత్తుగా ఎదో జబ్బు చేసింది. నెలల తరబడి మంచం మీద పడ్డారు. ఆయన్ను చూడాలని ఎప్పటి నుండో అనుకుంటున్నా ఈ రోజుకి తీరింది రమేష్‌కు, రమేష్ ఓ పత్రికా సంపాదకుడు.

"రా.. రా.. రమేష్ బాబు!.. చాలా రోజులకి.. ఎలా ఉన్నావ్" లోపలికి వస్తున్న రమేష్‌ను చూసి ప్రేమగా పలకరించారు రామ్మోహన్.



"నేను బాగానే ఉన్నా సార్! మీరేంటి..! ఇలా ఒక్కసారిగా గుర్తు పట్టలేనంతగా మారిపోయారు?" కంటి నిండుగా కనిపించే ఆయన విగ్రహం ఒక్కసారిగా మంచానికి కరుచుకుపోయి కనిపించేసరికి కన్నీళ్ళ పర్యాంతం అయ్యాడు రమేష్,

"నేను బాగానే ఉన్నానుగా.. ఎలా నడుస్తుంది మీ పత్రిక?" అడిగారు. "బాగుంది సార్. మీరు త్వరగా కోలుకోవాలి సార్! మా లాంటి వారికి మీరే స్ఫూర్తి. మీరిలా మంచానికే పరిమితమైతే మేమేం అయిపోవాలి సార్!" అన్నాడు ప్రేమగా రమేష్, రెండు నిమిషాలు ఇద్దరి మధ్యా మౌనం.. అందుకు కారణం ఆయన ఎక్కువ కాలం బతకడని ఇద్దరికీ తెలుసు. ఇంతలో తన కూతురు సంధ్యని పిలిచి చెవిలో ఎదో గుసగుసలాడారాయన. ఆమె రెండు నిమిషాల్లో లోపలి గదిలోకి వెళ్ళి ఏదో తండ్రికి తెచ్చి ఇచ్చింది. ఆయన రమేష్ చేతిలో చెయ్యి వేసి "ఇది ఉంచు.." అంటూ కొన్ని నోట్లను అతని చేతిలో పెట్టారు.

"ఇదేమిటి సార్! మిమ్మల్ని చూసి పోదామని వచ్చాను. డబ్బులు కోసం కాదు. నిజానికి మీ పరిస్థితి చూసి నేనే మీకు కొంత డబ్బు ఇద్దామనుకున్నాను. కానీ మీరు ఆత్మాభిమానంగలవాళ్లు మీది ఇచ్చే చెయ్యే కానీ తీసుకునే చెయ్యి కాదని నాకు తెలుసు. అలా చేస్తే మీ మనస్సు నొచ్చుకుంటుందని తెలిసే మీకు నేను ఏ విధమైన సహాయం చెయ్యలేకపోతున్నాను" అని అ డబ్బు తీసుకోడానికి నిరాకరిస్తూ ఆవేదనగా అన్నాడు రమేష్.

అతని అభిమానానికి నిలువెల్లా కరిగిపోయాడు రామ్మోహన్. గతంలో తాను ఆ పత్రికకి ఓ ప్రకటన ఇచ్చి డబ్బులు ఇవ్వలేకపోయాడు. దానిని ఇప్పుడు ఇద్దానునుకుంటే తన పరిస్థితిని చూసి అతను అన్న ఆ మాటలకి చలించిపోయాడు. రామ్మోహన్. ఎందుకంటే ఇంత క్లిష్ట పరిస్థితిలో తనను చూడటానికి వచ్చినవాళ్ళు, తాను ఇచ్చిన డబ్బును తీసుకొనిపోయేవాళ్ళేగాని రమేష్‌లా వద్దని అన్నవాళ్ళేలేరు. నిజమైన అతని వలకరింపుకి చలించిపోయి కన్నీళ్ల పర్యంతంతో.. ప్రేమతో రమేష్ చేతుల్ని గట్టిగా పట్టుకొని ప్రేమతో అదిమాయి. మానవ సంబంధాలన్నీ ఆర్థిక సంబంధాలే అని ఎవరు అన్నారోగానీ, అది అబద్ధమని.. నిజమైన మానవ సంబంధాలు, అనుబంధాల మధ్య ఇంకా మిగిలున్నాయని నిరూపించిన ఆ ఇద్దరి మధ్య సంభాషణని గోడ అవతల నుండి విన్న సంధ్య, మనస్సులోనే వారిని అభినందించింది.



## ఆకాశం

**ఆకాశం** నిత్యనిశ్చలానందం
అమ్మ మనసు చందం
అమ్మ వంటిదే ఆకాశం
అందుకే అంతా విశాలం!

మనం
ఆకాశ గంప కింది ప్రాణులం
గ్రహాలనే గుర్రాలపై ఎక్కించి
కీ ఇచ్చి పంపించింది.

వెలుగు-వెన్నెలలకు
సూర్య-చంద్రులనిచ్చింది
ఆహ్లాదం కొరకు
నక్షత్రాల సీరియల్స్ వేసింది.

ఉక్కిరి బిక్కిరి కాకుండా
మేఘాల వర్షం కురిపిస్తుంది
నీళ్లు వృథా పోకుండా కింద
గంగాళాలంత సముద్రాలనిచ్చింది!

అమ్మ అందరికీ అమ్మే కదా
ఆకాశమై పై నుంచి చూస్తుంటది
విసుగు వచ్చేవరకు ఆడుకొని
కొండెక్కి రమ్మంటది.

**- పి.బక్కారెడ్డి**

## సార్వత్రిక భావోద్వేగం

**ఏమైంది?**
ఒక్కన్రేమ కవితా రాయట్లేదు
కొన్నాళ్ల నుండి
అనడిగారో ప్రేమ కవితల అభిమాని.

ఎందరెందరో ఎంతెంతో రాసినా
ఇంకా ఇంకా మిగిలినట్టే అనిపించే కవితా
వస్తువది
ఎంతని రాయమంటారన్నాన్నేను.

నిజమే...
కొందరికి మరపురాని తీపి జ్ఞాపకంగానూ
కొందరికి మానని గాయంగానూ
కొందరికి నిత్య తోడుగానూ
నిలిచే సార్వత్రిక భావోద్వేగమది
చిత్ర విచిత్రాలు చేస్తుంది
ఎంతని రాస్తారులెండన్నారు.

మళ్లీ కలుద్దామంటూ
కాలు ముందుకు కదిపారు



తన చేతిలోని పుస్తకం పుటల మధ్య
దాచుకున్న
ముడతలు పడ్డ లేఖల్ని, చాకోలేట్
కవర్లని
ఎండి అణిగిపోయిన గులాబీ పువ్వుని
తనివితీరా తడుముకుంటూ.

**- కార్తీక రాజు**

## ఈ వారం కవిత్వం

## మాటైనా మౌనమైనా..

**ఆమె** ఎదురైతే
ఏదో తెలియని
అనంత ఆనందం.

ఆమెతో మాట్లాడితే
మనసుకెంతో ఉపశమనం
ఆ చూపులో ఏదో మత్తు

ఆమె మాటల్లో గమ్మత్తు
మాటైనా మౌనమైనా
అదే పెద్ద మహత్తు

ఆమె చేరువలో
చింతలన్నీ చితిమంటలైతే
తను దూరమైతే
దుఃఖాలన్నీ నా చుట్టే

ఆమెతో..
నా మనసు
ఆత్మ విడదీయ
వీలుగాని విధంగా
పెనవేసుకుని అల్లుకుని
ప్రేమ పారవశంలో
పులకించిపోయాయి.

**- శ్రీష్టి శేషగిరి**



## పంచ పదులు

**పెద్ద పెద్ద నోట్లు**
చిన్న నోట్లు. ఎన్ని నోట్ల మీద
గాంధీ బొమ్మ వేస్తే మాత్రం
ఆయన రుణం
మనం తీర్చుకోగలం?
..........
ఆ పిచ్చుక రోజూ
మా ఇంట్లోకొచ్చి అద్దం మీద పొడిచి
అందం చూసుకోకపోతే
ఏదైనా బ్యూటీ ప్యార్లర్‌కి
వెళ్లొచ్చుగా.
..........
నల్లని మేఘానిక్కూడా
బంగారు అంచుంటుంది
నల్లని అమ్మాయిక్కూడా
తెల్లని నవ్వుంటుంది.
..........
ఎంతో కాలంగా పేరుకుపోయిన
తాజ్‌మహల్‌పై దుమ్ము
ఎవరైనా తుడిచి శుభ్రపరిస్తే
ఇంకెంత మెరిసిపోయేదో
పగలే వెన్నెల్లా!
..........
పొద్దున్నే సముద్రం దగ్గరకెళ్లి
నిలబడ్డాను.
ఆకాశం సముద్రమయిందో
సముద్రం ఆకాశమయిందో
రెండూ ఒకే రంగు.

**- భూషి కృష్ణదాసు**

పావ్ అంటే బన్ను, భాజీ అంటే కూరగాయలు. వీటితో తయారయ్యే పావ్‌బాజీ.. మనందరికీ మహా ఇష్టం. చిన్న చిన్నగా చినుకులు పడుతుంటే. వేడి వేడిగా పావ్‌భాజీ తింటుంటే ఆహా.. ఎంత బాగుంటుందో.. వీధుల్లో దొరికే పావ్‌భాజీ రకాలు ఇంట్లోనే చేసుకుందామా !

# విభిన్న రుచుల పావ్ భాజీ

## జైన్ పావ్ భాజీ..



**కావలసినవి:** కాశ్మీరీ మిర్చి-12, నూనె-టేబుల్ స్పూన్, వెన్న-మూడు చెంచాలు, జీలకర్ర-చెంచా, క్యాప్సికం ముక్కలు – అర కప్పు, టమాటో ముక్కలు-రెండు కప్పులు, కారం-2 చెంచాలు, పావ్ భాజీ మసాలా-ఒకటిన్నర చెంచా, ఉప్పు- తగినంత, సన్నగా తుంచిన క్యాలీఫ్లవర్, పచ్చి బఠాణీలు-ఒక కప్పు చొప్పున, కొత్తిమీర తరుగు-అర కప్పు, బన్నులు-8, వేయించిన అప్పడాలు-8, నిమ్మరసం-చెంచా, **తయారీ:** కాశ్మీరీ మిర్చిని కొద్ది నీళ్లతో గ్రైండ్ చేసుకోవాలి. కడాయిలో నూనె, కొద్దిగా వెన్న వేసి వేడయ్యాక జీలకర్రను వేయించాలి. అందులో మిర్చి పేస్టు, క్యాప్సికం, టమాటో ముక్కలు, అర కప్పు నీళ్లు, కారం, పావ్‌భాజీ మసాలా, ఉప్పు వేసి 5 నిమిషాలు ఉడికించాలి. తర్వాత క్యాలీఫ్లవర్ ఉడికించిన బఠాణీల గుజ్జు, కొత్తిమీర తరుగు వేసి మరో 5 నిమిషాలు ఉడికించాలి. మధ్యమధ్యలో కలియతిప్పుతూ, మెదుపుతూ ఉండాలి. కడాయిలో రెండు చెంచాల వెన్న, పావు చెంచా పావ్ భాజీ మసాలా వేసి రెండు వైపులా వేయించుకోవాలి. ఉల్లి, టమాటో స్లయిసులు, నిమ్మచెక్క, పాపడ్‌లతో ఈ జైన్ పావ్ భాజీ సూపర్‌గా ఉంటుంది.

## చీజ్ పావ్ భాజీ



కావలసినవి : నూనె-3 చెంచాలు, బంగాళ దుంపలు-3, టమాటోలు-5, క్యారెట్-1, బీన్స్-6, ఉల్లిపాయలు-2, పచ్చిమిర్చి-3, క్యాప్సికం-1, కాశ్మీరీ చిల్లీ పౌడర్-2 చెంచాలు, జీలకర్ర పొడి, ఆమ్‌చూర్-చెంచా చొప్పున, ఉప్పు-తగినంత, పసుపు-అర చెంచా, ధనియాల పొడి, గరం మసాలా-రెండు చెంచాల చొప్పున, పావ్‌భాజీ మసాలా, బన్‌లు-8, చీజ్-కప్పు, నెయ్యి-2 చెంచాలు, కొత్తిమీర తరుగు-అరకప్పు **తయారీ :** బంగాళదుంపలు, టమాటోలు, క్యారెట్, బీన్స్‌లను కడిగి ముక్కలు కోసి ఉడికించాలి. చల్లారాక మెత్తగా మెదపాలి. కడాయిలో నూనె వేసి, వేడయ్యాక ఉల్లి, పచ్చిమిర్చి, క్యాప్సికం వేసి వేయించాలి. ఉడికించిన కూరగాయల మిశ్రమం, ఉప్పు, పసుపు, కారం, జీలకర్ర పొడి, ఆమ్‌చూర్, ధనియాల పొడి, గరం మసాలా, పావ్‌భాజీ మసాలా, కొన్ని నీళ్లు వేసి కలియతిప్పి మగ్గనివ్వాలి. కొత్తిమీర, చీజ్ తరుగు వేసి దించేయాలి. పావ్‌ను నేతిలో వేయించాలి. వేడి వేడిగా ప్లేటులో వడ్డించుకుని తినడమే తరువాయి.

## పనీర్ పావ్ భాజీ ..

**కావలసినవి :** బన్నులు-8, బంగాళదుంపలు-3, టమాటోలు-4, ఉల్లిపాయలు-2, పనీర్- కప్పు, ఉప్పు-కొద్దిగా, అల్లం వెల్లుల్లి ముద్ద-చెంచా, కారం-చెంచా, పసుపు-అర చెంచా, నెయ్యి, కస్తూరి మెంతి,, పావ్‌భాజీ మసాలా-2 చెంచాల చొప్పున, కొత్తిమీర తరుగు-అర కప్పు, నిమ్మరసం-చెంచా. **తయారీ :** అడుగు భాగం మందంగా ఉన్న పాత్రలో కొద్దిగా నెయ్యి వేసి, అందులో టమాటో ముక్కలు, పచ్చి బఠాణీలు, క్యాప్సికం, ఉడికించి చిదిమిన బంగాళదుంప, అల్లం-వెల్లుల్లి ముద్ద, ఉప్పు వేసి రెండు నిమిషాలు వేయించాలి. అరకప్పు నీళ్ల పోసి మూత పెట్టాలి. బాగా మగ్గిన తర్వాత మెత్తగా మెదపాలి. కారం, పసుపు, పావ్‌భాజీ మసాలా, కస్తూరి మెంతి వేసి కలియతిప్పాలి. చివర్లో పనీర్ నెయ్యి, ఉల్లి, కొత్తిమీర తరుగు, నిమ్మరసం వేసి ఒక నిమిషం ఉంచి దించేయాలి. నేతిలో వేయించిన బన్నుతో భాజీ అమోఘంగా ఉంటుంది.



## గ్రీన్ పావ్ భాజీ



**కావలసి నవి :** బన్నులు-6, క్యాలీఫ్లవర్, క్యాప్సికం, బూడిదగుమ్మడి ముక్కలు, సొర కాయ ముక్కలు, బచ్చలికూర, కొత్తిమీర, ఉల్లికాడల తరుగు, పచ్చి బఠాణీలు-అన్నీ ఒక కప్పు చొప్పున, వెల్లుల్లి ముక్కలు- 2 చెంచాలు, బంగాళదుంపలు-3, పచ్చిమిర్చి ముద్ద-చెంచా, ఉప్పు, పసుపు-చెంచా చొప్పున, వెన్న, నూనె-పావు కప్పు చొప్పున, పావ్‌భాజీ మసాలా-3 చెంచాలు, ఉల్లి ముక్కలు-కొద్దిగా, నిమ్మకాయ-ఒకటి. **తయారీ :** బన్నులను నేతిలో వేయించాలి. బూడిద గుమ్మడి, సొరకాయ, బంగాళదుంపల ముక్కలు, పచ్చి బఠాణీలను కుక్కర్లో ఉడికించుకోవాలి. బచ్చలి, ఉల్లికాడల ముక్కలను రెండు నిమిషాలు ఒక పాత్రలో ఉడికించి చల్లారాక గ్రైండ్ చేయాలి. వెల్లుల్లి, మిర్చి ముద్దను నేతిలో వేయించాలి. అందులో సన్నగా తుంచిన క్యాలీఫ్లవర్, క్యాప్సికం ముక్కలు వేసి అడుగంటకుండా కలియతిప్పుతూ మగ్గనివ్వాలి. ఇందులో కుక్కర్లో ఉడికించిన ముక్కలు, కొన్ని నీళ్లు, పసుపు వేయాలి. దగ్గరికి అయ్యాక బచ్చలిపేస్టు, పావ్‌భాజీ మసాలా వేసి నిమిషం పాటు సన్న సెగ మీద ఉంచి దించేస్తే సరిపోతుంది. ఉల్లి, నిమ్మరసాలతో వహ్వా.. అనిపిస్తుంది.

# ‘నో’ చెప్పడం ఒక కళ

మన నిత్య జీవితంలో ప్రతి ఒక్కరం తరుచుగా ఎదుర్కొనే సమస్య ఒకటి ఉంది. ఎవరైనా మిత్రుడు, సహోద్యోగి, లేదా వ్యక్తి మన నుండి ఒక సహాయం/చిన్న పని చేయమని అడిగినప్పుడు మనం ‘ఎస్’ చెప్పడానికి ఇష్టపడతాం గానీ ‘నో’ చెప్పడానికి పలు కారణాలతో వెనుకంజ వేస్తాం. మన దైనందిన జీవితంలో కొన్ని సందర్భాలలో మనం పనిలో నిమగ్నమైనపుడు ఇతరులు అడిగిన సహాయాన్ని వీలు కాదు లేదా ‘నో’ అని చెప్పడం కూడా మనకు మేలు చేస్తుంది, కాల పరిమితి కలిగిన మన లక్ష్య సాధనకు ఉపయోగపడుతుంది. మనకు వీలు కాదని తెలిసి ‘నో’ చెప్పాలని అనుకుంటూ, తీరా సమయం ఆసన్నమైనపుడు ‘ఎస్’ చెప్పడం సహజంగానే జరుగుతుంది. ‘నో’ చెప్పడం వల్ల మనల్ని స్వార్థపరులు లేదా సహాయం చేయడానికి ఇష్టపడనివారుగా అనుకుంటారని, మంచి పేరు కోసం ‘ఎస్’ చెప్తుంటాం. మనకు వీలైనపుడు ఎస్ చెప్పడం, ఇతరులకు సహాయపడడం మన కనీస కర్తవ్యం అని భావించాలి.



## ‘నో’ చెప్పడం అలవాటైతే..

‘నో’ చెప్పడం ఒక వైఫల్యంగా భావించరాదు. ఇతరులు కూడా కొన్ని సందర్భాల్లో మనకు ‘నో’ అని చెప్పినపుడు మనం దానిని పాజిటివ్‌గా తీసుకోవాలి. మన ముఖ్య పనులను పక్కన పెట్టి ఇతరులకు ‘ఎస్’ చెప్పి వారి పనుల్లో నిమగ్నం కావడం ఆత్మహత్యా సదృశ్యం అవుతుందని తెలుసుకోవాలి. వినయంగా ‘నో’ చెప్పడం వల్ల మానవ సంబంధాలు దెబ్బతినవు. ‘ఐ యామ్ సారీ, ఐ మే నాట్ గివ్ టైం నౌ’ అంటూ గౌరవంగా ‘నో’ చెప్పి తప్పించుకోవడం వల్ల మన ఎదుగుదల కొనసాగుతుంది. మనం నిత్యం ‘ఎస్’ చెప్పడానికి అలవాటు పడితే మన పనులు వెనక్కి నెట్టబడుతూ, మనం వైఫల్యాలను మూట కట్టుకోవలసి వస్తుంది. ఒకరికి ‘ఎస్’ చెప్పడం వల్ల మన విలువైన సమయం, ఆలోచనలు వ్యర్థం అవుతూ, మన ముఖ్యమైన పనులు ఆగిపోతాయి. ఇతరులకు ‘నో’ చెప్పడం వల్ల మన విధులకు మనమే ‘ఎస్’ చెప్పుకున్నట్లు అవుతుంది. ‘ఎస్’ చెప్పిన ప్రతిసారి మన సమయం తగ్గుతూ పని ఒత్తిడిలో చెమటలు పడతాయి.

మనకు సమయం దొరికినప్పుడు, మనం చేయగలమని అనుకున్నపుడు ఇతరులకు ‘ఎస్’ చెప్పడం మంచి అలవాటే అయినప్పటికీ మన లక్ష్య సాధనలో అంతరాయం కలుగుతుందని అనుకున్నప్పుడు ప్రేమగా ‘నో’ చెప్పడం అనే కళను అమలు పరుద్దాం, మన గమ్యాలను చేరుకుందాం. ■

డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి

# లక్ష్యాన్ని చేరుకోవాలంటే..

మనం ఎంచుకున్న లక్ష్యం/గమ్యాన్ని బట్టి మనకు ధనలక్ష్మి దీవెనలు దొరుకుతాయి. గమ్యాన్ని చేరితే తగిన ప్రతిఫలం దక్కుతుంది. కృషి చేసిన వారికి తగిన ఆదాయం లభిస్తుంది. అందువల్లనే లక్ష్యానికి, లక్ష్మి దేవికి అవినాభావ సంబంధం ఉంటుంది. దేవతల్లో సంపదను దీవించే బాధ్యత లక్ష్మి దేవికి మాత్రమే ఉంటుంది.

## లక్ష్యాలు స్మార్ట్‌గా ఉండాలి

మనం ఏర్పరచుకున్న లక్ష్యాలు మాత్రమే మనల్ని సమాజంలో ఉన్నతంగా నిలబెడతాయి. లక్ష్యాలను నిర్ణయించుకోవడం అంత సులభం కాదు. మన శక్తి సామర్థ్యాలు, అందుబాటులో ఉన్న వనరులను బట్టి మన లక్ష్యాలను నిర్ణయించుకోవాలి. సాధారణంగా మన లక్ష్యాలు ‘స్మార్ట్’గా ఉండాలని వింటుంటాం. ఎస్ఎంఏఆర్‌టి లేదా స్మార్ట్ అనే పదంలోని ప్రతి ఆంగ్ల అక్షరం ఒక అర్థాన్ని ఇస్తుంది. మన లక్ష్యం స్పెసిఫిక్‌గా(నిర్దిష్టమైన), మెజరబుల్‌గా (కొలువుల), అచీవబుల్‌గా (సాధ్యమైన), రియలిస్టిక్‌గా(వాస్తవానికి దగ్గరగా), టైమ్ బౌండ్(కాల పరిమితి)గా ఉండాలి. మనం విజయవంతంగా లక్ష్యాలను అధిగమిస్తే అమితానందం, ఉద్వేగం, సాధించాలనే ఆత్మవిశ్వాసం పెరుగుతూ భవిష్యత్తు లక్ష్యాలను సాధించవచ్చనే ధైర్యాన్ని నూరిపోస్తాయి. గమ్యం చేరడానికి మనం ఎంచుకున్న మార్గం సాఫీగా ఉండదని, అనేక అనుకోని మలుపులు, గుంతలు, స్పీడ్ బ్రేక్స్ ఉంటాయని మరువరాదు. మనం ఎంచుకున్న గమ్యం, ఆ గమ్యం చేరడానికి నడిచిన మార్గమే మనకు విజయాన్ని అందిస్తుంది. సామర్థ్యానికి మించిన లక్ష్యాలు మనకు అపజయాన్ని, నిరాశను, అధైర్యాన్ని అందిస్తాయని తెలుసుకోవాలి. గమ్యం లేకుండా తిరిగే మనిషి తెగిన గాలిపటంవలె గాలి వాటానికి ఏదో ఒక చెట్టు కొమ్మకో, పుట్టకో, గుట్టకో చిక్కుకొని నిరర్థకం అయిపోతుంది. మన గమ్యం పెద్దదైనా, చిన్నదైనా దానికి తగిన ప్రయత్నం చేయాల్సి ఉంటుంది. అప్పుడే మన వెంట లక్ష్మీదేవత నిలబడుతుందని మరువరాదు. “విజేతలు ఎవరైనా విలక్షణమైన పనులు చేయరని, మనం చేసే పనులనే వారు విలక్షణంగా చూస్తారు” అని గమనించాలి. చెమట కక్కినవారికి లక్ష్య సిద్ధి, లక్ష్మి దేవత వరిస్తాయి. నేటి విజయంతో జీవితం ముగిసిపోదు. మనం ఎంచుకున్న లక్ష్యాలను అధిగమిస్తూ జీవితాంతం ప్రతిరోజు విజయం బాటన నడవాల్సిందే. “నిత్య జయారాధనకు రోజుకో కొత్త పువ్వు (కొత్త లక్ష్యం) కావలసిందే”. అనునిత్యం సకారాత్మక లక్ష్యాలను ఛేదిస్తూ పయనించడమే మన జీవిత విజయ రహస్యం కావాలి. పని చేయకుండా ఫలితం ఆశించరాదు. లక్ష్యం చేరి లక్ష్మిని పొందాలి. ■

# 'హోలీ'తో వసంతాగమనం



**హోలీ** పండుగకు ఎంతో విశిష్టత ఉంది. తపస్సు చేస్తున్న పరమేశ్వరుడికి ఆటంకం కలిగించి కోరికలు రేకెత్తించడానికి మన్మథుడు ప్రయత్నం చేస్తుంటే ఆగ్రహించి పరమేశ్వరుడు తన మూడో కన్ను తెరిచి కాముడిని భస్మం చేసిన రోజు 'హోలీ'గా ఖ్యాతి గాంచింది.

హోలీ పండుగ ముందురోజు రాత్రి కాముడిని దహనం చేయడం ఆనవాయితీ. శైవ క్షేత్రాల్లో హోలీ రోజున 'కామ దహనం' పేరుతో ఉత్సవం నిర్వహిస్తారు. చలికాలం చలి తగ్గి వేసవి కాలం ప్రారంభమయ్యే సమయం.

## కామ దహనం ఎందుకు చేస్తారు?

పరమేశ్వరుడు కాముడిని భస్మం చేయడంలో ఒక విశిష్టత ఉంది. కాముడిని భస్మం చేయడం చేస్తూ ప్రజలకు ఒక సందేశం తెలియజేశాడు. ప్రతి ఒక్కరిలోనూ ఉండే రాగ, ద్వేష, కామ, క్రోధ, మోహ, మాయా మొదలైన గుణాలను వదిలించుకుని మనస్సును నియంత్రణలో వుంచుకోవాలనే సందేశం దాగి వుంది కామ దహనంలో. మనిషిలో వుండే కోరికలను దహింపజేసి మానసిక ఆరోగ్యాన్ని పెంపొందించుకోవాలనేది హోలీ పండుగలోని అంతరార్థం. హోలిక అనే రాక్షసిని తృప్తి పరిచేందుకు చేసే ఉత్సవాన్ని కామ దహనమని పిలుస్తారు. హోలీరోజు ఉదయాన్నే లేచి చిన్నా పెద్దా తారతమ్యం లేకుండా ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటారు. ఆ విధంగా చేయడం వల్ల సంవత్సరమంతా ఆనందంగా ఉంటామని నమ్మకం. ఈ పండుగను వసంతోత్సవమని, డోలికోత్సవమని కూడా పిలుస్తారు. రతీదేవితో పాటు మన్మథుని పూజిస్తే సకల సౌఖ్యాలు లభిస్తాయని పురాణోక్తి.

పరమేశ్వరుని మనసుని పార్వతిపై మళ్లించాలని మన్మథుడు పూలబాణం వేయడం వల్ల అతడిని భస్మం చేస్తాడు ఈశ్వరుడు.

రతీదేవి తన భర్త కామదేవుడిని బతికించమని ప్రార్థించడంతో శాంతించిన పరమేశ్వరుడు మన్మథునికి శరీరం లేకపోయినా అతడు సజీవంగా వుండే వరం ఇచ్చాడు పరమేశ్వరుడు.

మన్మథుడంటే కాముడు. కామ దహనం ఫాల్గుణ పౌర్ణమి రోజున జరిగింది కనుక దీనిని ఫాల్గుణ పౌర్ణమి రోజున జరుపుకోవడం ఆచారంగా వస్తోంది.

హిరణ్య కశిపుని సోదరి హోలిక. ఈమెను అగ్ని కూడా ఆమెను కాల్చలేదు, అంతటి శక్తివంతురాలు. హరి నామస్మరణ చేస్తున్న తన కొడుకు ప్రహ్లాదుణ్ణి ఒళ్లో కూర్చోపెట్టుకుని అగ్నిలో ప్రవేశించమని హిరణ్యకశిపుడు హోలికను ఆజ్ఞాపిస్తే హోలిక ఆయన



చెప్పినట్టు చేసింది. అయితే హోలిక అగ్నిలో కాలి బూడిదయ్యింది. కానీ ప్రహ్లాదుడు క్షేమంగా బయటికి వచ్చాడు. ఈ సంఘటనకు గుర్తుగా హోలీ పండుగను జరుపుకుంటారని మరో కథ. ఏది ఏమైనా వసంత రుతువును రాకను తెలియచేస్తుంది హోలీ పండుగ.

ఈ పండుగకు సంబంధించి ఇంకో కథ కూడా చెప్తారు. దేవతలపై విజయం సాధించిన గర్వంతో హిరణ్యకశిపుడు భగవంతుడిని పూజించకూడదని ప్రజల్ని శాసిస్తాడు. తండ్రి ఆజ్ఞను పాటించకుండా ప్రహ్లాదుడు విష్ణుమూర్తిని పూజిస్తాడు. అందువల్ల హిరణ్యకశిపుడు తన సోదరి హోలికతో తన కొడుకుని మార్చమని ఆమెకు చెప్తాడు. హోలిక ప్రహ్లాదుడితో పాటు మంటల్లోకి దూకడంతో ఆమె శక్తులన్నీ నశించి భస్మం అవుతుంది. మంటల్లోంచి ప్రహ్లాదుడు క్షేమంగా బయటికి వస్తాడు.

హోలిక మరణించడంతో ప్రజలు ఆనందంతో పండుగ జరుపుకుంటారు. అందువల్ల ఈ పండుగకు హోలీ పండుగ అన్న పేరు వచ్చిందని ప్రతీతి. ఉత్తరాదిన ఘనంగా జరుపుకునే పండుగల్లో హోలీ ముఖ్యమైంది. ■

## కార్టూన్లకు ఆహ్వానం

**కార్టూనిస్టుల నుండి ఆరోగ్య కరమైన హాస్యాన్ని అందించే కార్టూన్లను స్వాగతిస్తున్నాం. అంశం ఏదైనా సరే! మంచి హాస్యాన్ని అందించాలి. కార్టూన్లతో పాటు మీ పేరు, చిరునామా, హామీ పత్రం తప్పనిసరిగా జత చేయాలి. ఎంపిక కాని కార్టూన్లను తిప్పి పంపగోరేవారు తగిన పోస్టేజీ జత చేసిన కవరు పంపించాలి. కార్టూన్లు పంపించాల్సిన చిరునామా: ఎడిటర్, ఆదివారం వార్త, నం.396, లోయర్ ట్యాంక్ బండ్, డిబిఆర్ మిల్స్ పక్కన, హైదరాబాద్-80.**

***sunmagvaartha@gmail.com***

కథ

# పక్షుల పరోపకారం

**అనగనగా** ఒక రామచిలుక ఉండేది. అది గురుకులంలో ఒక గురువు దగ్గర చదువుకుంటుండేది. గురువు చెప్పిన చదువును, మంచి మాటలను చక్కగా ఒంటబట్టించుకునేది. ఒక రోజు గురువు పూలతోటలో ఓ పువ్వుపై వాలి ఉన్న సీతాకోక చిలుకను చూపిస్తూ సీతాకోకచిలుక పరోపకారి అని వివరిస్తూ, గురువు మన శరీరం పరోపకారం కోసం పుట్టిందని బోధించాడు. ప్రపంచం పరోపకారం చేస్తున్న మహానుభావులు వలన నడుస్తోందని చెప్పారు. పరోపకారం చేసేవారు లేకపోతే ప్రపంచం ఎప్పుడో అంతమయ్యేదని అన్నారు. పంచే గుణమే పోతే ప్రపంచమే శూన్యం అని పలికారు. పరోపకారం చేసే వారిని ప్రోత్సహిస్తే ప్రపంచం పది కాలాలు పచ్చగా వర్ధిల్లుతుందన్నారు. పరోపకారం చేసేవారిని గౌరవించడం మన కనీస ధర్మం. పరోపకారం చేసే జన్మే జన్మని, ఆది చేయని జన్మ నిజంగా జన్మ కాదన్నారు గురువు. ఇలా ఎన్నో మంచి మంచి విషయాలు గురుకులంలో నేర్చారు. గురుకులంలో విద్య పూర్తి చేసుకున్న రామచిలుక గురువు దగ్గర సెలవు తీసుకుని ఇంటికి బయల్దేరింది. రామచిలుక తన ఇంటికి వెళ్తూ వుంటే మార్గం మధ్యలో ఒక పెద్ద పూలతోట కనిపించింది. ఆ పూలతోటలో పూలపై ఒక సీతాకోకచిలుక వాలివుండడం చూసింది. ఈ సీతాకోకచిలుక నిస్వార్థ పరోపకారం వలనే పూలు, పిందెలు, కాయలు, పండ్లుగా మారుతున్నాయని గుర్తు చేసుకుంది. పరోపకారం చేసే వారిని గౌరవించాలనే గురువు మాటలు గుర్తొచ్చాయి రామచిలుకకు. వెంటనే అక్కడున్న రకరకాల పూలను తీసుకుని సీతాకోకచిలుకకు పూలాభిషేకం చేసింది. దీనికి ఉబ్బితబ్బిబ్బైన సీతాకోకచిలుక రామచిలుకకు కొంత పుప్పొడి ఇచ్చింది. పరోపకారంలో నా కన్నా తేనెటీగ గొప్పదంది. రామచిలుక తేనెటీగ దగ్గరికి వెళ్ళి, "పువ్వు పువ్వు తిరిగి కష్టపడి తేనె సేకరించి తేనె పట్టు పెట్టి దాన్ని ఆహారంగా బాటసారులకు ఇచ్చే గొప్ప పరోపకారివి నువ్వు" అంటూ పుప్పొడితో తేనెటీగకు అభిషేకం చేసింది. దానికి "నాదేం పరోపకారం. తను తిన్న తినకున్న ప్రపంచానికి కష్టపడి ఆహారాన్ని అందించే రైతన్న నిజమైన పరోపకారి" అంటూ కొంత తేనెను రామచిలుకకు ఇచ్చింది తేనెటీగ. తేనె తీగ చెప్పింది నిజమని రామచిలుక రైతు దగ్గరకు వెళ్లి రైతు ప్రపంచానికి చేస్తున్న మేలుకు చిహ్నంగా తేనెతో అభిషేకించింది. దానికి రైతు "ఇందులో నా గొప్ప ఏమీ లేదు. నా పంటలకు నది నీరు అందిస్తోంది. నా గొప్పతనం అంతా నదికే చెందుతుంది" అన్నాడు కొంత ధాన్యం రామచిలుకకు ఇస్తూ. రామచిలుక నది వద్దకు వెళ్లి నది పరోపకారానికి ధాన్యంతో అభిషేకించగా నది "ఈ గొప్పతనం వర్షాన్నిచ్చే మేఘానికి చెందుతుంది" అంది రామచిలుకకు తనలోని నీళ్ల ఇస్తూ. రామచిలుక మేఘం పరోపకారం మెచ్చుకొంటూ నదీజలాలతో సత్కరించింది. అప్పుడు మేఘం "మేం చెట్లు వర్షం వలన ఇవ్వగలుగుతున్నాం. ఈ ఘనత చెట్లుకు చెందుతుంది" అంది. రామచిలుక చెట్ల వద్దకు వెళ్లి చెట్లు చేస్తున్న పరోపకారానికి మురిసిపోయి మేఘం ఇచ్చిన వర్షపు నీటితో ఘనంగా చెట్టును సన్మానించింది. ఈ సన్మానం మా పుట్టుకకు మూలమైన పక్షిజాతికి చెందుతుంది అంది చెట్టు. పక్షులు పళ్ళు తింటూ "ఏ స్వార్థం లేకుండా గింజలను అక్కడక్కడ పడెయ్యడం వలన మహారణ్యాలు పుట్టాయి. పక్షులు తమకు తెలియకుండానే పరోపకారం చేస్తున్నాయి" అంటూ రామచిలుకను అడవిలోని పలు రకాల పండ్లతో గౌరవించింది. చెట్టు చెపితే తప్ప రామచిలుకకు పక్షుల పరోపకారం గురించి తెలియలేదు. అప్పుడు రామచిలుక "పక్షిజాతి కూడా ఎంతో కొంత ప్రపంచానికి పరోపకారం చేస్తున్నందుకు తన జన్మ ధన్యమైందని" అనుకుంటూ ఆనందంతో ఇల్లు చేరింది.



– రాళ్లబండి సంగంనాయుడు



వార్త ఆదివారం



## బాలగేయం

### పిల్లలం.. బడిపిల్లలం


చదువుల తల్లి
పిల్లలం
బడి పిల్లలం
శ్రద్ధగ చదివే
పిల్లలం
చక్కగ రాసే
బడి పిల్లలం

ఆటలు ఆడే
పిల్లలం బడి పిల్లలం
ఆనందంగా ఉండే
పిల్లలం
బడి పిల్లలం

వేళకు బడికి
వెళతాము
పాఠాలు శ్రద్ధగ
వింటాము
గురువులను
గౌరవిస్తాం

పిల్లలం.. బడి పిల్లలం
విజ్ఞానపథంలో
విహరిస్తాం
భావితరాలకు
ఆదర్శంగా ఉంటాం
పిల్లలం బడి పిల్లలం

- ఎల్. ప్రఫుల్లచంద్ర



## హలో ఫ్రెండ్...



చిన్నారుల ప్రశ్నలకు
వార్త సిఎండి, మేనేజింగ్ ఎడిటర్

### గిరీష్ అంకుల్ సమాధానాలు

ఎం.సంధ్య, నల్లగొండ


**ప్రశ్న: రంగులను ఎలా గుర్తిస్తారు?**

**జవాబు:** మల్లెపూవులు తెల్లగా ఎందుకుంటాయి? మల్లెపూవు అన్నిన రంగుల తరంగ దైర్ఘ్యాన్ని తనలో కలిపేసుకుంటుంది కాబట్టి. దాని మీద పడిన కాంతి పరావర్తనం చెంది తెల్లగా ఉన్నట్లు కనపడుతుంది. మరి, మల్లెపూవు తెల్లగా ఉన్న విషయం మనకెలా తెలుస్తోంది. మన కళ్లు మన మెదడుకు చెబితే అప్పుడు మనకు తెలుస్తుంది. అయితే, ఈ విషయం చెప్పుకున్నంత సులభమైన ప్రక్రియ కాదు. మెదడులో జరిగే ఈ ప్రక్రియతో పాటుగా రంగులను గుర్తించడం మీద సంస్కృతి, భాష కూడా ప్రభావం చూపుతాయని శాస్త్రవేత్తలు కనుగొన్నారు. పపువా న్యూ గినియాలోని బెర్నిమో అనే ఆదిమ తెగకు చెందిన ప్రజల మీద పరిశోధనలు చేస్తుండగా ఈ విషయం బయటపడింది. వీరికి నీలం రంగుకు, పచ్చరంగుకు మధ్య తేడా తెలియదు. అయితే పచ్చరంగులో రెండు రకాల ఛాయలను వీరు గుర్తించగలుగుతారు. పాశ్చాత్య దేశాల్లో ప్రజలు ఈ రంగులను గుర్తించటం కష్టం. ఈ విధంగా పాశ్చాత్య దేశాల్లో ప్రజల మీద కూడా ఇటువంటి ప్రయోగాన్ని చేశారు. వీరు ఈ రంగులను గుర్తించటం పెరిగింది.

బి.ఉమారాణి, కడప

**ప్రశ్న: కృత్రిమ వజ్రాలను ఎలా తయారు చేస్తారు?**

**జవాబు:** 1955 వరకు వజ్రం గనుల ద్వారానే లభించేది. ఆ తరువాత అమెరికాలోని జనరల్ ఎలక్ట్రిక్ కంపెనీ ప్రపంచంలో మొట్టమొదటిసారిగా కృత్రిమ వజ్రాలను తయారు చేసింది. వీటిని నకిలీ వజ్రాలని అంటారు. ఇటువంటి వజ్రాలను గ్రాఫైట్‌తో తయారు చేస్తారు. అత్యధిక ఉష్ణాన్ని అందించే కొలిమిలలో గ్రాఫైట్‌ను మూడు వేల డిగ్రీ సెంటిగ్రేడ్ వద్ద వేడి చేస్తారు. గ్రాఫైట్ వజ్రంగా రూపు దిద్దుకుంటుంది.







# బహుముఖ ప్రజ్ఞాశాలి

కోట దామోదర్

బహుముఖ ప్రజ్ఞాశాలి అయిన అతను ఓ జానపద గాయకుడు, రచయిత, "ఇక్ తారా" తుంబి అని పిలువబడే పంజాబీ సాంప్రదాయ సంగీతకారుడు కూడా. చిన్నతనం నుండే రచనలపై ఆసక్తి కారణంగా ఎన్నో రచనలు చేస్తూ, జానపద గాయకుడిగా, సంగీత కళను భారతీయ రేడియో, టెలివిజన్‌లో ప్రదర్శించేవాడు.

కుటుంబ ఆర్థిక పరిస్థితుల కారణంగా 9వ తరగతి వరకు మాత్రమే చదివి, ఉన్నత విద్యనభ్యసించలేక ప్రదర్శనల ద్వారా వచ్చే అరకొర సంపాదనతో ఇల్లు గడిచే పరిస్థితి లేకపోవడంతో ఏదో ఒక పని చేయడం తప్ప వేరే మార్గం లేకపోయింది. తన మొదటి ప్రయత్నంతో కోర్టులో అటెండర్ ఉద్యోగం సంపాదించాడు.

ఆయన ఉద్యోగంలో చేరినప్పటి నుండి న్యాయమూర్తి వద్ద ఎంత కష్టపడి పనిచేస్తున్నప్పటికీ, తన స్థాయి కారణంగా న్యాయమూర్తి తనకు సరైన గౌరవం ఇవ్వడం లేదన్న భావన కలిగింది. రోజంతా విధి నిర్వహణలో సమయం వెచ్చిస్తున్నందున తన నైపుణ్యాలను కోల్పోతున్నాన్న బాధ ఉన్నప్పటికీ, ఆర్థిక పరిస్థితి మెరుగు పడాలంటే ఉద్యోగం తప్పనిసరి అని నిర్ణయించుకున్నాడు. ఓ రోజు న్యాయమూర్తి ప్రవర్తనతో విసుగు చెంది, అటెండర్ ఉద్యోగానికి రాజీనామా చేశాడు. ఆ సంఘటన తర్వాత ఆ బాలుడు తన ఆత్మకథను "మై సాన్ జడ్జ్ దా అర్ధాలి" అని తన మాతృ భాష అయిన పంజాబీ భాషలో రాసుకున్నాడు. అతనే "నిందర్ ఘుగియాన్వి". నిందర్ ఘుగియాన్వి ఒక అటెండర్ స్థాయి నుండి ప్రొఫెసర్ స్థాయికి ఎదిగిన క్రమం ఎందరికో స్ఫూర్తిదాయకం. తొమ్మిదో తరగతి వరకు మాత్రమే చదువుకున్నప్పటికీ ఘుగియాన్వి 69 పుస్తకాలు రాశారు. తన ఆత్మకథలో భారత న్యాయ వ్యవస్థలో క్లాస్ ఫోర్ ఉద్యోగులను వ్యక్తిగత సేవకులుగా ఎలా ఉపయోగిస్తారో చిత్రీకరించబడింది. ఈ పుస్తకం ప్రజాదరణ పొందడమే కాదు అతని ఆత్మకథ "ఐ వాజ్ ఏ సెర్వెంట్ టు ఏ జడ్జ్" అని ఆంగ్లంతో పాటు 15 భారతీయ భాషలలోకి అనువదించబడింది. గురునానక్ దేవ్ విశ్వవిద్యాలయం, పంజాబీ విశ్వవిద్యాలయం, ఢిల్లీ విశ్వవిద్యాలయంతో సహా అనేక విశ్వవిద్యాలయాలు ఆయన రచనలను వారి పాఠ్యాంశాల్లో చేర్చాయి. 12 విశ్వవిద్యాలయాలలో ఎంఫిల్, పిహెచ్‌డి విద్యార్థులు ఆయన రచనలపై పరిశోధనలు నిర్వహించారు.

## అటెండర్ నుంచి ప్రొఫెసర్‌గా ఎదిగిన తీరు..

కోర్టు ఉద్యోగానికి రాజీనామా చేసిన తర్వాత పంజాబ్ భాషా విభాగంలో తోటమాలిగా చేరారు. అక్కడ అతని పని.. మొక్కలకు నీరు పెట్టడం, తోటను చూసుకోవడం మాత్రమే. ఘుగియాన్వి "ఇక్ తారా" తుంబి వాయించడంలో ప్రావీణ్యత కలిగినందున సాహిత్య విభాగంలో జరిగే కార్యక్రమాలలో ఇక్ తారా వాయించేవాడు. అతి తక్కువ సమయంలోనే సంగీత వాయిద్య కళాకారుడిగా అత్యంత ప్రజాదరణ పొందారు. ఒక తోటమాలి ఇంత ప్రజాదరణ పొందటమేంటని కొంతమంది అధికారులు అసూయపడి అతన్ని తోటమాలి ఉద్యోగం నుండి తొలగించారు. టాలెంట్ ఉన్నోడిని ఎవరు ఆపలేరు.. అన్నట్లు అతనికి పంజాబీ భాషపై పట్టున్నందున కాలక్రమేణా అతను ప్రభుత్వ భాషా శాఖ సభ్యుడిగా ఎంపికయ్యారు. మొదటిసారిగా తన కార్యాలయానికి వెళ్ళినప్పుడు అతనిని తోటమాలి ఉద్యోగం నుండి తొలగించిన అదే అధికారి, అతన్ని మిస్టర్ నిందర్ ఘుగియాన్వి జీ అని పిలవడం ప్రారంభించాడు. నిందర్ ఘుగియాన్వి సాధారణ జీవితం నుండి సాహిత్య ఔన్నత్యానికి ఎదగడం పంజాబీ సంస్కృతి, భాష, సాహిత్యం పట్ల ఆయనకున్న అంకిత భావానికి నిదర్శనం. పంజాబీ సంస్కృతికి ఆయన చేసిన కృషిని గుర్తించి పంజాబ్ విశ్వవిద్యాలయం 'సాహిత్య రతన్' అవార్డుతో సత్కరించింది.



అటెండర్‌గా తన కెరీర్‌ను ప్రారంభించి, తన ఉద్యోగంతో పాటు ఉన్నత విద్యను అభ్యసించాడు, చివరికి పంజాబీలో మాస్టర్స్ డిగ్రీ పొందారు. సాహిత్యం పట్ల ఆయనకున్న అభిరుచి, సుమారు డెబ్భై పుస్తకాలు రాయడానికి దోహదపడింది. ఆయన రచనలపై అనేక లఘు చిత్రాలు నిర్మించబడ్డాయి. ఆయన పంజాబ్ జానపదాలు, సంస్కృతిపై పరిశోధనలు చేశారు. అతని నైపుణ్యాన్ని గుర్తించి, IAS, PCS అభ్యర్థులకు ఉపన్యాసాలు ఇవ్వడానికి, అనుభవాలను పంచుకోవడానికి ఆయనను ఆహ్వానించారు.

ఇటీవల, ఆయన బటిండాలోని సెంట్రల్ యూనివర్సిటీలో ప్రాక్టీస్ ప్రొఫెసర్‌గా నియమితులయ్యారు. నిందర్ ప్రపంచ వ్యాప్తంగా USA, UK, కెనడా, ఆస్ట్రేలియా వంటి దేశాలు పర్యటించి విదేశీ సంస్కృతుల గురించి నేర్చుకుంటూనే తన సొంత సంస్కృతిని విదేశాలకు ప్రచారం చేశారు.

1994లో భారత రాష్ట్రపతి ఎస్.గియాని జైల్‌సింగ్, 2001లో కెనడా ప్రధానమంత్రి జి.క్రెచియన్, 2005లో యుకె ప్రధానమంత్రి టోనీ బ్లెయిర్ వంటి ఉన్నత స్థాయి ప్రముఖులచే సత్కరింపబడిన గౌరవం నిందర్ ఘుగియాన్వికి లభించింది.

నిందర్ ఘుగియాన్వి ఆత్మకథను 'నేను జడ్జిగారి సేవకుడ్ని' అన్న పేరుతో డా॥ రహీమ్ పఠాన్ ఖాన్ తెలుగులోకి అనువదించారు. జీవితం తరచుగా ఊహించని మలుపులు తీసుకుంటుంది. విజయం కొన్నిసార్లు తీవ్ర ప్రతికూల క్షణాల నుండి ఉద్భవిస్తుంది. ఆశయం కోసం నిరంతరం కృషి చేసినప్పుడు అనుకున్నది సాకారమవుతుంది. డబ్బు లేదని చింతించకుండా ఉన్న వనరులతో సాధన చేస్తే విజయం పాదాక్రాంతమవుతుంది. అనుకున్న లక్ష్యం నెరవేరుతుంది.

# పగ్డీ సంభాల్ జట్టా ఉద్యమం

యేచన్ చంద్ర శేఖర్

**వర్తక** వాణిజ్యం నెపంతో భారతదేశంలో అడుగుపెట్టి, క్రమ క్రమంగా అధికారం హస్తగతం చేసుకుని మనల్ని బానిసలుగా చేసి దేశ సంపదను యథేచ్ఛగా కొల్లగొట్టిన బ్రిటిష్ వలసవాద ప్రభుత్వాన్ని దేశం నుండి పారదోలేందుకు చేపట్టిన ఉద్యమాలలో 'పగ్రి (పగ్డీ) సంభాల్ జట్టా ఉద్యమం' కూడా ఒకటి. భారతీయ విప్లవకారుడు, జాతీయవాది అయిన సర్దార్ అజిత్ సింగ్ సంధు 1906లో 'పగ్రి సంభాల్ జట్టా' ఉద్యమానికి నేతృత్వం వహించాడు. ఈ ఉద్యమ ధాటికి దిగి వచ్చిన నాటి బ్రిటిష్ ప్రభుత్వం 1907లో వ్యవసాయానికి సంబంధించిన మూడు చట్టాలు చేసింది. 1) పంజాబ్ భూమి పరాయీకరణ చట్టం 1900; 2) పంజాబ్ భూమి వలసరాజ్య చట్టం 1906; 3) దోయాబ్ బారి చట్టం 1907లను రద్దు చేయవలసి వచ్చింది. సర్దార్ అజిత్ సింగ్ సంధు 1881 ఫిబ్రవరి 23న బ్రిటిష్ ఇండియాలోని పంజాబ్‌లోని జలంధర్ జిల్లా, ఖట్కర్ కలాన్ గ్రామంలో జన్మించారు. సామాజిక సంస్కరణలు, జాతీయవాదాన్ని ప్రోత్సహించే ఆర్య సమాజ సిద్ధాంతాల పట్ల సర్దార్ అజిత్ సింగ్ ప్రభావితమయ్యాడు.

## ఉద్యమ బాట

బ్రిటిష్ వలస విధానాలకు వ్యతిరేకంగా ఆందోళనలలో పాల్గొనడం ద్వారా సర్దార్ అజిత్ సింగ్ స్వాతంత్ర్య ఉద్యమ బాటలోకి ప్రవేశించాడు. పంజాబ్‌లో నిరసన కార్యక్రమాలను ప్రారంభించిన ఆద్యులలో అయన కూడా ఒకడు. తన సోదరుడు కిషన్ సింగ్‌తో కలిసి, 1905లో బరార్ (మధ్యప్రదేశ్), అహ్మదాబాద్, శ్రీనగర్, కాంగ్లాలోని వరదలు, భూకంప ప్రభావిత ప్రాంతాలలో ప్రజలలో పనిచేశాడు. యూరప్‌లోని వివిధ ప్రాంతాలలో భారతదేశ విముక్తి కోసం పోరాడుతున్న ప్రజలతో ఆయన సంఘీభావం కూడగట్టడంలో విజయం సాధించారు. అజిత్‌సింగ్ బ్రిటిష్ ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ఒక ముఖ్యమైన రైతు తిరుగుబాటు అయిన పాగ్రి సంభాల్ జట్టా ఉద్యమాన్ని ప్రారంభించాడు. రైతుల హక్కులను రక్షించడం, అన్యాయమైన చట్టాలను ప్రతిఘటించడం ఈ ఉద్యమం లక్ష్యంగా పెట్టుకుంది. 'పగ్రి సంభాల్ జట్టా' (ఓ రైతు, నీ తలపాగాను జాగ్రత్తగా చూసుకో) అనేది ఉద్యమానికి నినాదంగా మారింది. వ్యవసాయ చట్టాలపై ప్రజలలో పెల్లుబుకిన ఆక్రోశాన్ని వలస ప్రభుత్వాన్ని కూల్చివేసేందుకు వినియోగించుకోవాలని ఆయన భావించారు. అజిత్ తన అన్న కిషన్ సింగ్, వారి విప్లవ స్నేహితుడు ఘసితా రామ్‌తో కలిసి, ఈ అశాంతిని బ్రిటిష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా తిరుగుబాటుగా సమీకరించే లక్ష్యంతో 'భారత్ మాతా సొసైటీ'ని స్థాపించారు. సూఫీ అంబా ప్రసాద్, జియా ఉల్‌హక్, లాల్ చంద్ ఫలక్, దీన్ దయాళ్ బంకే, లాలా రామ్ శరణ్ దాస్ వంటి అనేక మంది యువ విప్లవకారులు భారత్ మాతా సొసైటీలో సభ్యులుగా చేరారు. ఆ తరువాత అతను భారతదేశంలోని అత్యంత ప్రసిద్ధ విప్లవకారులలో ఒకడిగా మారాడు.



## నిర్బంధం

పంజాబ్‌లో ఉధృతంగా కొనసాగుతున్న ఉద్యమాన్ని అణచివేసేందుకు, నాటి బ్రిటిష్ ప్రభుత్వం, మే 1907లో లాలా లజ్‌పత్ రాయ్‌తో సహా సర్దార్ అజిత్ సింగ్‌లను దేశం నుండి బహిష్కరించి బర్మాలోని మండలేకు తరలించినప్పటికీ, తీవ్ర ప్రజా ఒత్తిడి, భారత సైన్యంలో అశాంతి రేకెత్తుతుందన్న భయం కారణంగా, వారిద్దరినీ 11 నవంబర్ 1907న విడుదల చేసింది. నవంబర్ 1907లో విడుదలైన తర్వాత కూడా అజిత్ సింగ్ తన విప్లవాత్మక కార్యకలాపాలను నిర్భీతిగా కొనసాగించాడు. తన సోదరులు కిషన్ సింగ్, స్వరణ్ సింగ్, సూఫీ అంబా ప్రసాద్‌లతో కలిసి, బ్రిటిష్ ప్రభుత్వ విధానాలను తీవ్రంగా విమర్శిస్తూ రాజకీయ సాహిత్యాన్ని ప్రచురించాడు. బ్రిటిష్ ప్రభుత్వం తమ నిర్బంధానికి సమాయత్తమవుతుందన్న విషయం తెలుసుకున్న అజిత్ సింగ్, సూఫీ అంబా ప్రసాద్‌లు 1909లో, ఇరాన్‌కు పారిపోయి 38 సంవత్సరాలు అజ్ఞాతంలో గడిపారు. అజ్ఞాత సమయంలో, అజిత్ సింగ్ రోమ్, జెనీవా, పారిస్, రియో డి జనీరోలతో సహా విస్తృతంగా ప్రయాణించాడు. 1918లో ఆయన శాన్ ఫ్రాన్సిస్కోలో బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా విప్లవాత్మక కార్యకలాపాలు నిర్వహిస్తున్న గదర్ పార్టీతో అనుబంధం ఏర్పరచుకున్నాడు. రెండవ ప్రపంచ యుద్ధ సమయంలో, నేపుల్స్‌లోని ఒక విశ్వవిద్యాలయంలో ఆయన పర్షియన్ భాషను కూడా బోధించడంతో పాటు ఉత్తర ఆఫ్రికాలోని భారత సైనికులను ఉద్దేశించి హిందుస్తానీలో ప్రసంగాలు చేసి వారిని భారతదేశ స్వాతంత్ర్య పోరాటంలో చేరేలా ప్రేరేపించాడు. భారత స్వాతంత్ర్య ఉద్యమానికి అంతర్జాతీయ మద్దతును సేకరించే లక్ష్యంతో విదేశాలలో ఆయన కృషి కొనసాగింది.

ప్రధాన మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన జవహర్‌లాల్ నెహ్రూ జోక్యం చేసుకోవడంతో సర్దార్ అజిత్ సింగ్ చివరకు భారతదేశానికి తిరిగి వచ్చేందుకు అంగీకరించాడు. ఆయన మార్చి 7, 1947న లండన్ మీదుగా భారతదేశానికి తిరిగి చేరుకున్నాడు.

హిమాచల్ ప్రదేశ్‌లోని డల్హౌసీకి తరలి వెళ్లే ముందు ఆయన కొంత కాలం ఢిల్లీలో గడిపాడు. యాదృచ్ఛికమే అయినప్పటికీ, భారతదేశం బ్రిటిష్ వలస పాలన నుండి స్వాతంత్రం పొందిన రోజు, 15 ఆగస్టు 1947న సర్దార్ అజిత్ సింగ్ డల్హౌసీలో మరణించడంతో భారతదేశం ఒక గొప్ప యోధుడిని కోల్పోయింది.

కథ

# నువ్విచ్చిన జీవితం

పంతంగి శ్రీనివాసరావు

"నిజం చెప్పు భావనా.. నేను ఆరోజు నిన్ను ఆదరించకపోతే నీ పరిస్థితి ఎలా వుండేది?" ఒక్కసారి కాదు ఎన్నోసార్లు పదే పదే ఇదే పదం శ్రీహర్ష నోటి నుంచి.

ఆమె ఆత్మాభిమానాన్ని కించపరచేలా.. తన గొప్పను పదే పదే ప్రదర్శించుకోవడం.. ఆమె లోపొరల్లో తెలియని సంఘర్షణ.

"నిజమే.. తను చేసింది గొప్ప పనే.. మరీ ఇంతలా.. ఛ.. మగాళ్ళంతా ఇంతేనా.. వారి ఆదర్శం వెనక ఇంత సంకుచిత మనస్తత్వమా.." ఒంటరిగా నున్నప్పుడు ఎంతగా మూగవేదన అనుభవించవలసి వస్తుందో.. తను జీవితాంతం 'కన్య'గా వుండిపోయినా బావుండేది. పొరలు పొరలుగా గతం..

ఓ ప్రైవేట్ వెహికల్‌లో తిరుపతి వెళ్ళివస్తోంటే ఘోరమైన యాక్సిడెంట్. ఆ యాక్సిడెంట్‌లో తల్లిదండ్రులను కోల్పోయిన భావన 'సుషుప్తావస్థ'లోకి వెళ్ళిపోయింది. అప్పుడే యువజన సంఘ వార్షికోత్సవాలలో పాల్గొని అదే దారిలో వెళ్తోన్న మిత్రబృందం జరిగిన ఆ సంఘటనకు విచలితులయ్యారు. అందులో ఆ సంఘ నాయకుడు శ్రీహర్ష తీవ్రగాయాల పాలయిన ఆ యువతిని దగ్గరలోనే వున్న హాస్పిటల్‌లో చేర్పించాడు.

"ఇప్పుడేం చేద్దామంటావు?" అందులో ఒక యువకుడు తోటివారిని ప్రశ్నించాడు.

"అదేమిటి మిత్రమా! చేసేది ఏముంది? తల్లిదండ్రులను కోల్పోయి, దిక్కు లేకుండా మిగిలిన ఈ అమ్మాయి తిరిగి కోలుకునేంతవరకు అండదండలు అందించవలసిన బాధ్యత మనందరిపైనా వుంది. ఈ అమ్మాయి కోలుకునేంతవరకు నేను ఇక్కడే వుంటాను. దృఢంగా చెప్పాడు వారిలోని ఒక యువకుడు.

"అదెలాగ హర్షా.. మన మీటింగు అయిపోయింది. జనాలను జాగృతం చేయటానికి మనం సమాయత్తం కావాలిగా.." చెప్పాడు ఆ బృందంలోని మరో యువకుడు.

"నిజమే.. ఆ పనిని మీరందరూ చేయండి. మానవ విలువల గురించి ఉపన్యసించే మనం.. ఇటువంటి పరిస్థితుల్లో ఈ అమ్మాయిని హాస్పిటల్‌లో వదలి వెళ్ళడం భావ్యం కాదు. ఈ అమ్మాయి కోలుకునేంతవరకు నేను నా బాధ్యతను నిర్వహిస్తాను. మనం తరచూ ఫోన్‌లలో మాట్లాడుకుందాం.." దృఢంగా చెప్పాడు శ్రీహర్ష అనే యువకుడు.

"మంచి నిర్ణయం.. అలాగే కానివ్వు. ఏదైనా అవసరం వస్తే మేమంతా ఉన్నామని మరచిపోకు. హాస్పిటల్ బిల్లు గురించి నువ్వేమీ వర్రీకాకు. మనందరమూ షేర్ చేసుకుందాం. సరేనా.." అక్కడ నుంచి కదిలింది, మిత్రబృందం శ్రీహర్ష మినహా..

... ... ...

నాలుగు రోజుల అనంతరం మెల్లగా కోలుకున్న భావనకు తను హాస్పిటల్‌లో వున్న విషయం గుర్తుకు వచ్చింది. యాక్సిడెంటు జరిగిన విషయమూ జ్ఞాపకం వచ్చింది. ఒక్కసారిగా 'బ్లాస్ట్' అయి బిగ్గరగా రోదించసాగింది. అప్పుడే బయట డాక్టర్‌తో మాట్లాడుతున్న శ్రీహర్ష హఠాత్తుగా లోపలకు వచ్చాడు.

"హలో.. ఏమయింది.." దగ్గరగా వచ్చి భావనను కుదిపాడు.

"నేను.. నేను.."

"కూల్ డౌన్.. ఇదిగో మంచి నీళ్ళు తాగండి.." అంటూ వాటర్‌బాటిల్ అందించాడు.

ఆమెను కొద్దిగా తెరపిన పడనిచ్చి.. "మీ పేరు.." అడిగాడు.

"భావన.." చెప్పింది రుద్ధ కంఠంతో.

"చూడండీ భావన.. కొద్దిగా రిలాక్సు అవండి. జరిగిన సంఘటన ఒక పీడకల.." సముదాయించసాగాడు.

"ఎలా.. ఎలా.. నేను బతికీ దండగ."

"అదేమిటి? భగవంతుడు మీకు ఆయుష్షు ఇచ్చాడు. ఆయనకు కృతజ్ఞతగా మీరు జీవించాలి. పోయినవారితో మనం పోలేం. బై ది బై భావనా.. నా పేరు శ్రీహర్ష. మీరు ఆ స్థితిలో వుండగా హాస్పిటల్‌లో చేర్పించింది నేనూ, మా మిత్రబృందం. మేం స్వచ్ఛంద సేవకులం. గ్రూప్స్ రాశాను. సెలెక్టు అయాను.. పోస్టింగ్ కోసం వెయిటింగ్.. ఇది క్లుప్తంగా నా గురించి.." చెప్పాడు.

"నన్ను ఎందుకు రక్షించారు..? నేను కూడా అమ్మా నాన్నలతో.." "స్టుపిడ్‌లా మాట్లాడకండి భావనా.. తల్లిదండ్రులను కోల్పోవటం ఎంత లోటో నాకూ తెలుసు. ఎందుకంటే నాకు కూడా తల్లిదండ్రులు లేరు. నేను అన్నయ్య సంరక్షణలో పెరిగాను. మీ కుటుంబ సభ్యులు ఇంకెవరన్నా వుంటే చెప్పండి.. మిమ్మల్ని వారికి ఒప్పచెప్పి నా బాధ్యతను తీర్చుకుంటాను.."

అతను మాట్లాడేటప్పుడు అతని వైపే చూస్తోంది భావన. చిరునవ్వు అతని వదనంలో. కొద్దిసేపు ఆగి శ్రీహర్ష "భావనా.. మీకు ఐ మీన్.. బ్రదర్స్.. రిలేటివ్స్.." అన్నాడు.

"మా అమ్మా నాన్నలకు నేను ఒక్కదానినే. వారిది ప్రేమ వివాహం. నాన్నకు వారి తరపు బంధుత్వాలు ఏవీ లేవు.

అమ్మకు ఒక అన్నయ్య వున్నాడు. నాకు మేనమామ. అమ్మ అడపా దడపా మామయ్యకు ఫోన్ చేస్తుండేది. అంతవరకూ తెలుసు.." చెప్పింది భావన.

"ఆయన నంబరు మీకేమైనా తెలుసునా? అని అడిగాడు"



"ఊఁ.. మామ నంబర్ నేను ఫీడ్ చేసుకున్నాను.. ఏదయినా పండుగలకు విషెస్ చెప్తుండేవాడు.."

"మీకు ఆస్తులు.."

"ఉహు.. (మాది దిగువ మధ్య తరగతి కుటుంబం. నాన్న ఓ ప్రైవేటు ఉద్యోగి. ఉండేది కిరాయి ప్లాటులో. మంచి జీతంతో నాన్నకు మరో ప్రైవేటు కంపెనీలో జాబ్ వచ్చింది. క్వార్టర్ కూడా వారే ఇస్తామన్నారు. ఆ ఆనందంలో తిరుపతికి వెళ్ళి.." ఎంతో దీనంగా చెప్తోన్న ఆమె కేసి అలాగే చూస్తూండిపోయాడు.

"అయితే, మీ మామయ్య గారితో ఒకసారి మాట్లాడాలి.." అడిగాడు.

ఫోన్ నెంబరు కలిపి ఇచ్చింది భావన. అవతల ఫోన్‌లో మాట్లాడేప్పుడు శ్రీహర్ష ముఖకవళికలను గమనించసాగిందామె.

ఆమెను డిస్టర్బ్ చేయటం ఇష్టంలేక కొద్ది దూరం నుంచి ఫోన్‌లో మాట్లాడసాగాడు శ్రీహర్ష.

ఐదు నిమిషాల తర్వాత

తన ఫోన్ తనకు తిరిగి ఇచ్చిన శ్రీహర్షను అడిగింది భావన.

"ఏమన్నాడు మామయ్య?" అని.

"ఏమీలేదు.. వస్తానన్నాడు. మీరు రెస్ట్ తీసుకోండి. మరో రెండు రోజుల్లో మిమ్మల్ని డిశ్చార్జ్ చేస్తారట.." అతని మొహంలోని ఫీలింగ్స్ గమనించి మరలా అడిగింది ఆమె.

"ప్లీజ్.. శ్రీహర్షా.. నేను తట్టుకోగలను. మామయ్య ఏమన్నాడు? మీరు సరియైన జవాబు చెప్పకపోతే మానసికంగా మరింతగా నేను ఇబ్బంది పడవలసి వస్తుంది.." అది అభ్యర్థనో, హెచ్చరికనో శ్రీహర్షకు అవగతం కాలేదు.

"ఉన్న చెల్లెలు పోయింది.. ఆమెను భరించడం ఇక తన వల్ల కాదన్నాడు.."

"అవునులే.. ఏనాడూ అమ్మను చూడటానికి రాలేదు. ఇది ఆయన ఆలోచనో, అత్తయ్య ఆలోచనో. ఇక దాని గురించి ఆలోచించలేను. మీరు నన్ను బతికించారు. అందుకు వేలవేలు కృతజ్ఞతలు. దయచేసి ఇక మీరు మీ ఇంటికి వెళ్ళిపోండి. నా బతుకు ఎలా రాసిపెట్టి వుందో.." ఆమె కళ్ళల్లో ధారావాహికంగా అశ్రువులు.

"సారీ.. భావనా.. ఈ పరిస్థితుల్లో మిమ్మల్ని వదలి వెళ్ళడం మానవత అనిపించుకోదు. మీరు కోలుకున్నాక మీకొక దారి చూపించడం నా విద్యుక్త ధర్మం. ఇక మీరు ఎక్కువగా ఆలోచించకండి. రెండు రోజులు ఓపిక పట్టండి. మీ తలకు బలమయిన దెబ్బ తగలడం వలన ఆ ప్రభావం మెదడు మీద పడితే చాలా ప్రమాదం. మీకు ప్రశాంతత చాలా ముఖ్యమని చెప్పాడు డాక్టర్.."

ఆమె అతనికేసి అలా బేలగా చూస్తూండిపోయింది.

ఫార్మాలిటీస్ అన్నీ పూర్తయ్యాక భావనను డిశ్చార్జ్ చేశారు. భావనలో శ్రీహర్ష అంటే అంతులేని కృతజ్ఞత ఏర్పడింది.

"అసలు అతనెవరు? ఇంత ఖర్చుతో నాకు పునర్జన్మ ఇచ్చాడు. ఆమెలో అతనంటే అలవిమీరిన ఆరాధనా భావం.."

సరాసరి భావనను ఓ లేడీస్ హాస్టల్ ముందు దింపి, ఆ హాస్టల్‌లో చేర్పించాడు శ్రీహర్ష. కొద్దిసేపటి తర్వాత ఆమెను ఓ షాపింగ్ మాల్‌కు తీసుకువెళ్ళి ఆమెకు కావలసిన సమస్తం కొనుగోలు చేశాడు.

"నా గురించి మీకెందుకు ఇంత తాపత్రయం. ఇంత ఖర్చు.. మీ రుణం.." అంటోన్న ఆమెను ఆపి..

"అంత పెద్ద పెద్ద మాటలు వద్దు గానీ.. కొద్దిరోజులు ఆగితే మీకు ఏదయినా దారి దొరుకుతుందేమో చూద్దాం.. మీకు ఏ అవసరం వచ్చినా ఈ మిత్రుడిని మరచిపోవద్దు.." బయటకు వచ్చేముందు చెప్పాడు శ్రీహర్ష.

అలా అలా వారి మధ్య మొదలయిన పరిచయం.. ఫోన్‌లలో వారి వారి సంభాషణలు.. ఎంతో చనువుకు దారితీశాయి.

ఒకరోజు అడిగాడు శ్రీహర్ష.. "భావనా.. బాగా ఆలోచించి ఓ నిర్ణయం తీసుకున్నాను. నా జీవితంలో శాశ్వత భాగం పంచుకోగలవా.." అని.

"ఈ అనాథకు బతుకునిచ్చారు. అంతవరకు చాలు.. మీకు బంధుత్వాలున్నాయి. మీ వాళ్లకూ కొన్ని కలలుంటాయి. నాకు ఇప్పటివరకు చేసిన మేలే ఎక్కువ. ఇక చాలు సారీ.. శ్రీహర్షా.."

"నిజమే.. మా అన్నయ్యవాళ్ళు ఒప్పుకోకపోవచ్చు. నేను జాలితో ఈ నిర్ణయం తీసుకోవడం లేదు. నీ జత కూడకపోతే నా ఆదర్శాలకు విలువనే లేదు. మరో వారంలో నాకు జాబ్ వస్తుంది. మనం హ్యాపీగా వుండవచ్చు.. ఇక, నువ్వు ఎక్కువగా ఆలోచించవద్దు.."

ఓ రెండు రోజుల్లో కొంతమంది మిత్రుల సాక్షిగా ఆర్య సమాజ్‌లో శ్రీహర్ష, భావన దంపతులయ్యారు.

...................

"ఎంత పని చేశావ్ హర్షా.. నిన్ను మా స్వంత కొడుకుగా చూసుకున్నాం. మా చిన్నాన్న కూతురిలో నీపై ఆశలు రేకెత్తించాను. ఎంతో అర్థబలం, అంగబలం గల ఆ ఇంటికి నిన్ను అల్లుడిని చేద్దామనుకున్నాను. ఇక, మా బంధుత్వం ఏం కావాలి? ఒక్క మాట మాతో చెప్పకుండా నీ నిర్ణయం నువ్వు తీసుకున్నావు. ఏవో ఆదర్శాలు అంటూ ఉపన్యాసాలు ఇస్తుంటే, కుర్రాడు కదా అని అనుకున్నాం. కానీ, ఇంత ఆలోచనారహితమయిన పని చేస్తావని అనుకోలేదు. ఏదో ఒకనాడు పశ్చాత్తాప పడినా, వెనుదిరిగి చూసుకున్నా నీకు మిగిలేది శూన్యమే.."

**"ఈ అనాథకు బతుకునిచ్చారు. అంతవరకు చాలు.. మీకు బంధుత్వాలున్నాయి. మీ వాళ్లకూ కొన్ని కలలుంటాయి. నాకు ఇప్పటివరకు చేసిన మేలే ఎక్కువ. ఇక చాలు సారీ.. శ్రీహర్షా.."**

మంచిది.. ఇప్పుడు నువ్వు ఉద్యోగస్తుడివి. ఇక, నీ బతుకు నువ్వు బతకాలనుకున్నావేమో! సరే.. ఇంత జరిగాక మిమ్మల్ని చూసుకుంటూ, ఆత్మవంచన చేసుకుని మేం బతకలేం . దయచేసి ఈ అన్నా వదినలను మరచిపో.." వదిన.

ఎంతో ఆప్యాయంగా చూసుకున్న తన వదిన నుంచి ఏదో బాధాకరమయిన మాటను ఊహించుకున్న శ్రీహర్షకు అంతకు మించి ఆమె ఆలోచనలు వున్నాయని తెలుసుకుని ఒక విధమయిన సంఘర్షణకు లోనయ్యాడు శ్రీహర్ష.

మౌనంగా, తల వంచుకుని ఓ ఛీత్కారపు చూపును చూసి తన అన్నయ్య లోపలకు వెళ్ళిపోయాడు.

...................

"భావనకు.. తనకు అందమయిన జీవితాన్ని ఇచ్చిన శ్రీహర్ష మీద ఎంతో అనురాగం.. కృతజ్ఞత.

అయితే, ముమ్ముందు తన ఆనందం ఆవిరి అవుతుందని ఆమె ఊహించలేదు. ఎందుకంటే, మానవ మనస్తత్వాలు ఎప్పుడూ ఒక్క తీరుగా వుండవు.

రాను రానూ ఇతరుల సంసార జీవితం, తన సంసార జీవితం మీద ప్రభావం చూపితే.. అది తను తట్టుకోగలదా.. అది ఆమె ఆలోచనలకు, భవిష్యత్తు పటానికి అందని విషయం.

"భావనా.. రేపు సండే మా ఫ్రెండ్ మనింటికి లంచ్‌కు వస్తున్నాడు. వాడికి ఈ మధ్యనే వివాహం అయింది. వాడి భార్య కలిగినింట గారాబంగా పెరిగినమ్మాయి. అయితే, ఒక విషయం తెలుసా? వాడు కూడా నాతో పాటు యువజన సంస్థలో పనిచేశాడు. నేను ఆదర్శ వివాహం చేసుకున్నాను. వాడేమో ఓ పెద్ద గాలం వేశాడు. 'పెద్ద' ఫ్యామిలీ.. లంచ్ ప్రోగ్రాం అదిరేట్టు వుండాలి సుమా! ఏమేమి ఐటెంస్ ఎలా ఎలా చేస్తావో.." చెప్పుకుపోతున్నాడు శ్రీహర్ష. ఆమె వింటోన్నా, ఎక్కడో సుతిమెత్తగా సూదులతో గుచ్చినట్లు ఫీలింగ్. అనుకున్నట్టుగానే మధ్యాహ్నం పన్నెండు గంటల ప్రాంతంలో ఆ ఇంటి ముందు కారు ఆగింది. అందమయిన జంట ఆ ఇంట అడుగుపెట్టింది.



"వెల్ కం సుఖేష్.." అంటూ అతడిని, అతని భార్యనూ భావనకు పరిచయం చేశాడు శ్రీహర్ష.

లంచ్ పూర్తయ్యాక భావన వంటకాలను చాలా బాగా మెచ్చుకుంది సుఖేష్ జంట.

కొద్దిసేపయ్యాక చెప్పాడు సుఖేష్.. భావనకు.. "ఆరోజు.. మిమ్మల్ని ఆ స్థితిలో చూశాక హర్ష బాగా చలించిపోయాడు భావనా.. నిజంగా వాడి వల్లనే మీరు క్యూర్ అయ్యారు. మీ కోసం వాడు అన్నీ, అందరినీ వదులుకున్నాడు.." అతడు ఒక పక్కన శ్రీహర్షను ప్రశంసిస్తున్నా, మరోవైపు తనపట్ల సానుభూతి చూపే విధానం ఆమెకు కంటగింపుగా మారుతోంది. వెళ్ళేప్పుడు చెప్పాడు సుఖేష్.. "నెక్స్ట్ వీక్ మీరు కూడా మా ఇంటికి ఆతిథ్యానికి రావాలి.." అని.

"చూద్దాం.. చాలా దూరం కదా.. అంత దూరం బైక్ డ్రైవ్ కష్టం. నువ్వంటే ఏదో మీ మామగారు బహూకరించిన కారులో తిరుగుతున్నావు కానీ.. నాకు అంత సీన్ లేదు.." శ్రీహర్ష మాటల్లో ఒక విధమయిన నిర్లిప్తత.

"అన్నట్టు మీ అన్నా వదినలకు నీ మీద కోపం తగ్గిందా హర్షా.." అనడిగిన సుఖేష్‌కు "ప్చ్" అంటూ పెదవి విరుపుతో జవాబిచ్చాడు శ్రీహర్ష.

తను పొరబాటు చేసిందా.. తన వలన శ్రీహర్ష చాలా కోల్పోయాడు. ముఖ్యంగా తనను పెంచి, ఆశ్రయం ఇచ్చిన అన్నా వదినలను.. అంతా.. తన వల్లనే.. ఆమెలో ఒక అపరాధ భావన.. ఈ మధ్య శ్రీహర్ష తీరులో ఒక వింత మార్పు. అతని మాటల్లో పదే పదే దెప్పిపొడుపులు. నిండా రెండేళ్ళు కాలేదు తమ వివాహమయి. ఇంకా కొన్ని దశాబ్దాలు కలిసి గడపాలి. ఇంత అసంతృప్తి.. ఏవేవో ఆదర్శాలంటూ వయస్సు వేడిలో, ఆలోచనా రహితంగా అతను తీసుకున్న నిర్ణయం.. ఈ రోజు తన ఆత్మగౌరవానికి సవాలుగా నిలవడం సహించలేకపోతోంది భావన. ఒకరోజు నిలదీసింది. "నేను నన్ను చేపట్టమని మిమ్మల్ని ఏనాడూ అడగలేదు. మీరే ప్రపోజ్ చేశారు. హాస్టల్‌లో చేర్పించి నన్ను వదిలివేయవలసింది. ఒక సంఘ సంస్కర్తగా, సమాజపు మెప్పుకోసం నాకు ఈ జీవితాన్ని ఇచ్చి, ఈ రోజు మీరు మథనపడుతూ, నన్ను పదే పదే కించపరచడం భావ్యంగా వుందా హర్షా.. ఎందుకిలా నన్ను మీ వెటకారాలతో హింసిస్తారు.." ప్రశాంతంగానే చెప్తోన్నా, అతని మస్తిష్కానికి సూటిగా తగిలేలా ప్రశ్నల బాణాలు సంధిస్తోంది భావన.

"వెల్ కం సుఖేష్.." అంటూ అతడిని, అతని భార్యనూ భావనకు పరిచయం చేశాడు శ్రీహర్ష. లంచ్ పూర్తయ్యాక భావన వంటకాలను చాలా బాగా మెచ్చుకుంది సుఖేష్ జంట.

"ఏదో ఆరోజు అలా జరిగింది. అంతా నా ప్రారబ్ధం.. ఒక మంచి సంబంధం వదులుకున్నాను. అయిన వారికి దూరమయ్యాను.." నుదురు వత్తుకుంటూ తిరిగి అన్నాడు శ్రీహర్ష.

"పోనీ.. అది గతం.. ఇప్పుడు నీకేమి తక్కువయింది.. అందరినీ కోల్పోయినా.."

"ఆపండి హర్షా.. ఒక్క తిండి దొరికితే సరిపోతుందా.. ఇది ఎక్కడయినా దొరుకుతుంది. కాసింత శ్రమ చేస్తే.. పదే పదే మీ మాటలతో నన్ను హింస పెడుతున్నారు. మీరు నాకు ఈ జీవితం ఇవ్వడం ఏమోగానీ, మీలోని మార్పును నేను ఆస్వాదించలేకపోతున్నాను. ఐ యామ్ సారీ.. ఆ దేవుడు నన్ను కూడా అమ్మా నాన్నలతో.." వెక్కి వెక్కి ఏడుస్తోంది ఆమె. ఆమెకేసి అలా నిర్వేదంగా చూస్తూండిపోయాడు తప్ప, కనీసం భావనను దగ్గరకు తీసుకుందాం అన్న స్పృహ కూడా శ్రీహర్షకు కలగలేదు.

అతని మెదడులో చేరిన పురుగు పదే పదే అతని మనస్సును మున్ముందు మరింతగా ఛిద్రం చేస్తుందనే ఆలోచన ఆమెలో బలపడింది..

........................

"శ్రీహర్షా! మృత్యుముఖం నుండి నన్ను కాపాడారు.. అందుకే, ఇది మీరిచ్చిన జీవితం.. మీ ఆదర్శాలకు నన్ను చేపట్టారు.. అందుకు, కృతజ్ఞతలు.. ఒక ఇల్లాలి హోదా కల్పించారు. సమాజాన్ని ఎదిరించారు. మీరు నా దృష్టిలో అసలుసిసలయిన హీరో.. అయితే, ఇది ఒక పార్శ్వమే అని తేటతెల్లం అయినాక.. మీరు, నేను ఏమి కోల్పోయిందీ తెలిసింది. మీరు మీ ఆశలు పణం పెట్టారు. నేను నా ఆత్మగౌరవాన్ని తాకట్టు పెట్టలేను. నేను అనాథను అయినంత మాత్రాన ఆత్మవంచన చేసుకుంటూ బతకలేను. గత ఆరు నెలలుగా మీలో ఏదో అసంతృప్తి గమనిస్తున్నాను.

నలుగురితో మిమ్మల్ని పోల్చుకోవడం, దానికి నా మనస్సుతో ఆటాడుకోవటం.. ఇక ఇది నేను భరించలేను. నాకు దొరికిన అదృష్టం ఏమిటంటే– నేను మరో జీవికి ఈ లోకంలో చోటు ఇవ్వకపోవటం.. అందుకే నేను మీ జీవితం నుంచి తప్పుకోవాలని నిర్ణయించుకున్నాను.

ఈ అసంతృప్తులతో– మీ ఆనందాన్ని దూరం చేసుకోకండి. ఇక, మీ జీవితం మీ ఇష్టం. నేను అడ్డురాను. నన్ను వెదికే ప్రయత్నం మీరు చేయరు. అది నాకు తెలుసు. నేను సుదూర ప్రాంతానికి వెళ్తున్నాను. అక్కడ ఏదైనా ఆశ్రమంలో సేవ చేసుకుంటూ నా భవిష్యత్తును గడుపుతాను. నా "సిమ్" కూడా మార్చబోతున్నాను. ఈ జ్ఞాపకాలు కొద్ది రోజులే..! ఆ తర్వాత మీ లైఫ్ మీది. నా వ్యాపకం నాది. నేను సరైన నిర్ణయం తీసుకున్నానని అనుకుంటున్నాను. ఇది 'నువ్విచ్చిన జీవితమే' హర్షా.. ఎప్పుడయినా కృతజ్ఞతలు చెప్పాలంటే నా మాజీ సహచరుడు శ్రీహర్షకే చెప్పాలి. ఇక, మనం కొత్త జీవితం ప్రారంభిద్దాం. నా వలన మీరు కోల్పోయినవి నేను ఇవ్వలేను. సారీ.. నా మనస్సుకు నచ్చిన నిర్ణయం ఇది.. సెలవు.. ఇక మీది కాలేని భావన.."

సాయంత్రం ఆఫీసు నుంచి వచ్చిన శ్రీహర్షకు 'పింక్' కలర్ పేపరు మీద గుండ్రటి అక్షరాలతో లిఖించబడిన లేఖ వెక్కిరించింది. అతనిలో కొద్దిగా పశ్చాత్తాప భావన.

# తెలుగుకూ తమిళ భావోద్విగ్నత అవసరం

ప్రాచీన కాలం నుండి వింధ్య పర్వత శ్రేణికి దక్షిణంగా వ్యాపించిన జాతి తెనుగు జాతి. ద్రవిడ భాషలలో తెన్ అంటే దక్షిణం. క్రమేపీ తెనుగు, తెలుగు వాడుకలోకి వచ్చాయి. తెలుగువారుండే ప్రాంతానికి తెలంగాణము అనే పేరు ఏర్పడింది. ద్రాక్షారామం, శ్రీశైలం, కాళేశ్వరం.. మూడు సుప్రసిద్ధ శైవక్షేత్రాలు నెలకొన్న త్రిలింగ దేశం ఆంధ్రజాతి పేరిట దేశమైంది. టాలెమి అనే గ్రీక్ భూగోళ శాస్త్రజ్ఞుడు క్రీ.శ.150వ సంవత్సర ప్రాంతంలో నాటి దేశ వర్ణనలో ట్రెలింగానే ఉదహరించాడు. నాటి ప్రాచీన భారతావనిలో, గంగానది దక్షిణ తీరం నుండి గోదావరి ఉత్తర తీరం వరకు విస్తరించిన 'కళింగ' పలుకుబడి త్రిలింగ పదంగా దేశం ఆవిర్భవించిందని చరిత్రకారులు స్పష్టం చేస్తున్నారు. ప్రాచీన తలైంగ్ జాతి నివాస భూమిగా తెలుంగు, తెలుగు ప్రసక్తి వుంది. ప్రాచీన ఆంధ్ర-తెనుగు శబ్దాల పుట్టుక కాలానుగుణంగా ఆంధ్రజాతి ఆర్య ద్రవిడ సమ్మేళనం ఏర్పడి వుండవచ్చని ఆంధ్ర సాహిత్య చరిత్ర సంగ్రహంలో ఆచార్య ఖండవల్లి లక్ష్మీరంజనం వివరించారు. దేశీయమైన ఔత్తరాహిక హిందీ, మరాఠీ భాషలే కాకుండా సంస్కృత భాషా ప్రభావాన్ని తనలో యిముడ్చుకొని లోకోత్తర శక్తిగల సజీవ భాషగా తెలుగు రూపొందిందని ప్రముఖ విద్వత్కవి నిడుదవోలు వేంకట్రావు సోదాహరణంగా నిరూపించారు.

తెలుగు భాష అజంత భాష. ఇటలీ భాష కూడా అజంత భాషే. అచ్చులతో అంతమయ్యే అజంత భాష లయబద్ధంగా సంగీతంతో ఒదిగిపోయే మధుర శ్రావ్య లక్షణం కలిగి వుంటుంది. త్యాగరాజస్వామి తమిళుల మధ్య వుంటూ భాష, ప్రాంతీయ వ్యత్యాసాలు, వైషమ్యాలు తల ఎత్తని ఆ రోజులలో పూర్వ జన్మ సుకృతంగా, మన మాతృభాషకు కీర్తనల ద్వారా శాశ్వత కీర్తి ప్రతిష్ఠలు అందించారు. తమిళ జాతీయకవి సుబ్రహ్మణ్య భారతీయార్, సింధు నదిలో కేరళ యువతి, ఒయ్యారంగా కదిలే పడవలో 'సుందర తెలుంగు'లో పాట ప్రయాణం సృష్టించే మధురానుభూతి ప్రస్తావించారు.

తెలుగు లిపి క్రీ.పూ. 3,4 శతాబ్దాల నుంచి కొనసాగుతున్న శాసనాధారాలు స్పష్టంగా వున్నాయి. శాతవాహనులు, రాష్ట్రకూటులు, హయహయ, చోళ,



కళింగ, కర్నాటక రాజ్యాధినేతలు తెలుగును పెంచి పోషించారు.

కాలం ఒక మహా ప్రవాహం. ఒకానొక కాలంలో ప్రాకృతం, సంస్కృతం, తమిళం, కన్నడం, మలయాళం, ఉర్దూ వంటి భాషలతో కలిసి కాపురం చేసిన భాషలు, కొన్ని పూర్తిగా శాసనాలు, పౌరాణిక మత సాహిత్యానికి పరిమితం కావడంతో దేశీ భాషలు వ్యక్తిత్వాన్ని నిలబెట్టుకోవలసిన అగత్యం వర్తమానంలో తల ఎత్తింది. ప్రపంచంలో పలు దేశాల భాషల స్థితిగతుల వాస్తవాలు ఒక పక్కన పెడితే, మన దేశంలో స్వదేశీ భాషల పరిస్థితి అగమ్య గోచరంగా మారుతోంది. భాషా ప్రముఖ రాష్ట్రాల ఆవిర్భావం, పాలనా సౌలభ్యాన్ని సాధించడం కంటే రాజకీయ అధికార ఆధిపత్యానికి సవాలుగా పరిణమిస్తోంది. ఒకప్పుడు గాంధీజీ, భారతజాతి ఐక్యత, సంఘటిత దృష్ట్యా హిందీ ప్రచారోద్యమ ఆవశ్యకత, స్వరాష్ట్ర భాషల సమున్నతత్వంతో కొనసాగాలని అభిలషించారు. స్వాతంత్ర్యానంతరం జాతినేతలు త్రిభాషా సూత్రం ప్రవేశపెట్టి హిందీని రాజ్య వ్యవహార భాషగా ప్రాధాన్యం కల్పించారు. దక్షిణాది రాష్ట్రాలలో హిందీ దక్షిణ భారత హిందీ ప్రచార సభ, బ్యాంకులు, బీమా, కేంద్ర ఉపాధి అవకాశాలు, వర్తక వాణిజ్యాభివృద్ధి ఎన్నో రంగాలలో జాతి సమైక్యతా లక్ష్యం దృష్ట్యా హిందీ ప్రధాన పాత్ర వహిస్తోంది.

విశాల భారతావనిలో 40 కోట్ల జనాభా నుంచి ప్రస్తుత అజాదీ కా అమృత మహోత్సవ్ సందర్భానికి 140 కోట్లకు చేరిన జనాభాకు భాషా ప్రాతిపదికన వ్యక్తిగతంగాను, సామాజిక పరంగాను భాష జీవనాధారం అయింది. దక్షిణాదిన కేరళ, కర్నాటక, తమిళనాడు, ఆంధ్ర, తెలంగాణ వంటి రాష్ట్రాలలో అధికార రాజకీయ ప్రాబల్యాన్ని సాధించే కృషిలో రాజకీయ పార్టీలు కులం, మతం, వర్గం ఏకత్వంలో భాగంగా భాషను కూడా ఆయుధంగా స్వీకరించారు.

ప్రపంచంలో వున్న వేలాది భాషలలో తెలుగు, దేశంలో రెండవ స్థానం నుంచి దిగజారిపోతోందనే విషయం వినవస్తోంది. మాతృభాషా దినోత్సవ ప్రాధాన్యతను యునెస్కో, అంతర్జాతీయ విభజన తర్వాత 1948లో పాకిస్థాన్ ప్రభుత్వం అక్కడ ఉర్దూను సహజంగా అధికార భాషగా ప్రకటించింది. కానీ తూర్పు పాకిస్థాన్‌లో, అత్యధిక ప్రజల మాతృభాష బెంగాలీ కావడంతో బెంగాలీని అధకార భాషగా ప్రకటించాలని ఉర్దూ పట్ల నిరసనోద్యమం ఉధృతం అయింది. ఆ ఉద్యమం అణచివేత కాల్పులలో ఢాకా హైకోర్టు వద్ద నలుగురు విద్యార్థులు ప్రాణాలు కోల్పోవడం, 1956లో పాక్ ప్రభుత్వం దిగి వచ్చి బెంగాలీని అధికార భాషగా ప్రకటించడం చారిత్రక పరిణామం. 'అమర్ సోనార్ బంగ్లా'గా 1971లో ముజిబుర్ రహ్మన్, భాషా సమ్మోహిత ప్రాతిపదికన బంగ్లాదేశ్ ఆవిర్భవించింది. ప్రస్తుత 2024లో బంగ్లాదేశ్‌లో స్థితిగతులు వినూత్న పరిణామాలు రాజకీయంగా ఎదుర్కొంటున్నాయి. ఆంధ్ర విశారద తాపీ ధర్మారావు, కేవలం 400 తెలుగు పదాలలోనే తెలుగువాడి సుఖదుఃఖాలు, సకల వ్యాపకాలు, వ్యవహారాలను, సుఖంగా వెళ్లబోసుకోవచ్చని, ప్రేమానురాగాలను గాఢంగా వొలకబోసుకోవచ్చని అన్నారు. రెండు తెలుగు రాష్ట్రాల మాతృభాషగా తెలుగు, తమిళ సోదరుల భావోద్విగ్నతతో ప్రగాఢ అనుభూతుల గత, వర్తమాన అనుభవాల మార్గదర్శకాన్ని అనుసరించగలదా?

యామిజాల జగదీశ్

# పనిని బట్టి ఫలితం..

ఓ సాధువు చెట్టుకింద కూర్చున్నారు. ఆయనేమీ ఉట్టినే కూర్చోలేదు. ఓ సూది చెవిలో దారం ఎక్కించి ఓ ధోవతికున్న చిరుగుని కుడుతున్నారు. వేళ్ళు తన పని చేసుకుంటున్నాయి. మనసు మాత్రం దేవుడ్ని స్మరించుకుంటోంది. ఆ సమయంలో గగన వీధిలో శివపార్వతులు పోతున్నారు. ఓ చెట్టుకింద కూర్చుని తినుగుని కుట్టుకుంటున్న సాధువును పార్వతీ దేవి చూసింది. అదే విషయాన్ని శివుడితో ప్రస్తావించి సాధువుని చూడమంది.

“అవును చూసాను దేవీ!” అన్నాడు పరమశివుడు.

“చూసారుగా.... చూసిన తర్వాత కూడా మనం ఏమీ పట్టనట్లు వెళ్లిపోతే ఎలా?” అంది పార్వతీ దేవి.

“ఆయన వద్దకు వెళ్ళి ఏదైనా కోరుకోమని చెప్పి ఆ కోరికను తీరుద్దాం” అంది. పరమశివుడు ముఖాన చిన్న నవ్వు విరిసింది.

“అతని గురించి తక్కువ అంచనా వేయకు. అతను ఇప్పటికే ఎన్నింటినో అధిగమించాడు. ఇప్పుడు మనం అతని వద్దకు వెళ్ళడం వృథా....కనుక మన దారిన మనం పోదాం” అన్నాడు పరమశివుడు.

అయినా మహిళలు ఓ మాట చెప్పారంటే అది అక్కడికో ఆగదుగా. వారేమనుకుంటే అది జరగాల్సిందే. లేకుంటే అలకే. పార్వతీదేవి పట్టు బట్టి పరమేశ్వరుడిని సాధువు దగ్గరకు బలవంతంగా తీసుకుపోయింది. అయితే మగవాళ్ళు సహజంగా ఏం చేస్తారో అది చేసాడు పరమేశ్వరుడు. అది ఏంటంటే, చెప్పదలచుకున్నది చెప్పి మరో దారి లేక సరేనని పార్వతీదేవి వెంట అడుగులు వేసాడు శివుడు.

ఇద్దరూ కలిసి సాధువు ఎదుట నిల్చున్నారు. నమస్కరించారు.

సాధువు తల పైకెత్తి చూసారు, అరెరె, శివపార్వతులు....రండి రండి అని చెప్పి ఎంతో ఆప్యాయంగా ఆహ్వానించాడు. దాహంతో వచ్చి ఉంటారంటూ లోపలికి వెళ్ళి రెండు గ్లాసులతో మజ్జిగ తెచ్చిచ్చి తాగమన్నాడు. అనంతరం సాధువు తన ధోరణిలో చినిగిన ధోవతిని కుటడం మొదలుపెట్టాడు.

శివపార్వతులు కాస్సేపు సహనం పాటించారు. మౌనంగా సాధువునే మౌనంగా. కానీ ఆ సాధువు వారి వంక చూడటం లేదు. కుట్టడంలో నిమగ్నమయ్యాడు.

ఇక లాభం లేదనుకున్న శివపార్వతులు వెళ్ళొస్తామన్నారు. చాలా సంతోషం వెళ్ళిరండి అన్నాడు సాధువు. అలా చెప్పి సాధువు మళ్ళీ చినుగు కుట్టుకుంటున్నాడు.

పార్వతీదేవి శివుడి వంక చూస్తూ అడగండి అన్నట్టుగా కనుసైగ చేసింది.

అది అర్థం చేసుకున్న శివుడు సాధువుతో “మేం ఎవరికైనారే కనిపిస్తే వారికి



ఏదైనా వరం ఇచ్చిగానీ వెళ్ళం. కనుక నీకు ఏం కావాలో కోరుకో” అన్నాడు.

సాధువు ఓ నవ్వు నవ్వాడు. “ఏమిటీ వరమా....నాకు మీ దర్శనమే భాగ్యం. అంతకన్నా గొప్పది ఇంకేముంటుంది... నాకు ఎటువంటి కోరికలూ లేవు.... మీరు వెళ్ళిరండి” అంటూ సాధువు తన పని తాను చేసుకుంటున్నాడు.

అయినా శివపార్వతులు వదల్లేదు. “ఏం కావాలో చెప్పండి” అని అడిగారు.

“నీకు ఏదైనా వరం ఇచ్చాకే ఇక్కడి నుంచి వెళ్తాం” అన్నారు శివపార్వతులు.

వాళ్ళు వెళ్లేటట్టుగా లేరని గ్రహించిన సాధువు “సరే, మీరు నాకు వరం ఇచ్చే వెళ్ళాలనుకుంటే ఓ పని చేయండి...ఈ సూదికి వెనకాతల నుంచే దారం వెళ్ళేటట్టుగా చేయండి” అన్నాడు సాధువు.

శివపార్వతులకు సాధువు ఏం చెప్తున్నాడో అర్థం కాలేదు.

“అదేమిటీ? ఇప్పటికే నువ్వు వెనుక నుంచే కదా సూదిలోకి దారం ఎక్కించారు. మళ్ళీ మేమేం చేయాలి...అది వరమేమిటీ?” అన్నాడు శివుడు.

“అదే నేను చెప్తున్నానండి....నేను క్రమశిక్షణ తప్పకుండా ఏదైనా మంచి పని చేసినప్పుడు అందుకు తగిన ఫలితం తానుగా వస్తుంది. కనుక మీరు ఇప్పుడు నాకు వరం ఇవ్వడమెందుకూ?” అన్నాడు సాధువు,

ఆ మాటలకు శివపార్వతులు నవ్వుకున్నారు. కొన్ని క్షణాల తర్వాత అక్కడి నుంచి వెళ్ళిపోయారు.

మంచో.. చెడో.. ఏ పని చేసినా అందుకు తగిన ఫలితం అనుభవించాలి, కష్టమో.. సుఖమో అనుభవించాల్సిందే. అది తప్పదు.

.........

ముప్పై ఏళ్లకు కంటిచూపు కోల్పోయిన వ్యక్తి ఒకడు మానసిక వెలుగుతో మిగిలిన జీవితమంతా గడిపాడు. మనసుని స్వచ్ఛంగా ఉంచుకోని మనిషి అందుకు తగినట్టే ఫలితాన్ని అనుభవిస్తాడు. అందులో ఎటువంటి అనుమానమూ లేదు. మనసు స్వచ్ఛంగా పవిత్రంగా లేని వ్యక్తి దైవ నామస్మరణ చేసి ఏం లాభం? దైవ నామస్మరణతో పాటు సదా మంచినే ఆలోచిస్తూ మంచి పనులే చేసేవారికి ఫలితాలు కూడా మంచిగానే ఉంటాయి. అది తథ్యం. ఇందుకోసం ప్రత్యేకించి ఏమీ కోరుకోనక్కర్లేదు. అందువల్ల ఒకడు ఆస్తికుడా? నాస్తికుడా? అనేది ముఖ్యం కాదు. అతని మనసు స్వచ్ఛంగా ఉండాలి” అని చెప్తున్న క్షణంలో ఒకతను నా ఎదుటకొచ్చి నిల్చున్నాడు.

“ఏమిటి విషయం?” అని అడిగాను.

“మీరు నాకో వరం ఇవ్వాలి” అన్నాడు అతను.

“ఏమిటీ చెప్పు” అన్నాను.

“మీరు తరచూ పురాణ గాథలు చెప్పి మా సహనాన్ని పరీక్షిస్తున్నారు ఈ క్షణం నుంచి మీరు ఆ పనిని మానేసెయ్యండి” అని అన్నాడతను.

## వాస్తువార్త

**వాస్తు విద్వాన్ సాయిశ్రీ**

**డా॥ దంతూరి పండరినాథ్**

సెల్: 9885446501/9885449458



# మెట్ల కింద స్టోర్ రూమ్ కట్టవచ్చా?



**(గత వారం తరువాయి..)**

పశ్చిమంలో, దక్షిణంలో అనే కాకుండా... వీలును బట్టి కొందరు తూర్పులో (ఇంద్రస్థానం) లేదా ఉత్తరంలో (కుబేర స్థానం) కూడా మెట్లు కట్టుకొని, వాటి కింద టాయిలెట్స్, స్టోర్ రూమ్స్ కట్టుకుంటూ ఉంటారు. ఇది మరింత పెద్ద దోషం. ఇంటి లోపల తూర్పు వైపు కానీ అంటే.. తూర్పు మధ్య భాగంలో కానీ ఉత్తరం వైపు... ఉత్తరం మధ్య భాగంలో కానీ మెట్లు కట్టుకోవటం వాస్తు ప్రకారం దోషం. అలా తూర్పు మధ్య భాగంలో కానీ ఉత్తర మధ్య భాగంలో కానీ బాత్రూమ్స్, స్టోర్ రూమ్స్ ఇవి కట్టుకోవడం కూడా దోషమే. ఇటువంటి చోట మెట్లు కట్టుకొని, మెట్ల కింద ఈ స్టోర్ రూమ్స్, బాత్రూమ్స్ కట్టుకోవడం ఇంకా చాలా పెద్ద దోషం. దీనివల్ల దోషం సాంద్రత అనూహ్యంగా పెరుగుతుంది. ఇటువంటి చోట నివాసం ఉండటం వలన అనతి కాలంలోనే అనేక రకాల చెడు సమస్యలను, అనేక రకాల చెడు పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుంది. అందుకని ఇట్లాంటి దోషాన్ని కలగజేసే విధంగా మెట్లు కానీ, మెట్ల కింద బాత్రూమ్స్, స్టోర్ రూమ్స్, ఏ విధమైన గదులు కానీ కట్టకూడదు.

ఇంటి లోపల కాకుండా ఇంటి బయట కూడా మనం మెట్లు కట్టుకోవటానికి వాస్తు ప్రకారం నిర్దేశింపబడిన స్థలాలు ఉన్నాయి. ఇంటికి తూర్పు ఆగ్నేయంలో, దక్షిణ ఆగ్నేయంలో, దక్షిణ నైరుతిలో, పశ్చిమ నైరుతిలో, ఉత్తర వాయువ్యంలో మెట్లు నిర్మించవచ్చు. ఎట్టి పరిస్థితుల్లో కూడా ఇంటికి ఈశాన్యంలో... తూర్పు ఈశాన్యమైన సరే, ఉత్తర ఈశాన్యమైన సరే... అక్కడ మెట్ల నిర్మాణం చేయకూడదు. వాస్తు ప్రకారం నిర్దేశించబడిన స్థలంలో ఇంటి బయట మెట్లు కట్టడం మంచిదే కానీ మళ్ళీ ఆ మెట్ల కింద టాయిలెట్స్, స్టోర్ రూమ్‌లో ఇట్లాంటివి కట్టకూడదు. ఇంటి బయట అయినప్పటికీ ఇంటికి ఆనుకొని మెట్లు కట్టి, ఆ మెట్ల కింద టాయిలెట్స్ స్టోర్ రూమ్స్ కట్టి వాటి పైన నడుస్తూ ఉండటం వలన తప్పకుండా చెడు ఫలితాలు ఉంటాయి. మెట్ల క్రింద సాధారణంగా 'మిడ్ ల్యాండింగ్' కింద ఇవి కడుతూ ఉంటారు. మనిషి నిలబడటానికి కావాల్సినంత స్థలం సరిపోకపోవడం వలన, కొంచెం ఫ్లోర్‌ని కిందకు తవ్వేసి, స్థలాన్ని ఏర్పాటు చేసుకుంటారు. ఇది మరింత తీవ్రమైన దోషం అవుతుంది. నైరుతిలో స్టోర్ రూమ్స్, బాత్రూమ్స్ కట్టుకోవచ్చు అనుకొని, నైరుతి మెట్ల కింద కూడా ఈ విధంగా నిర్మాణం చేసుకుంటారు. ఇంటికి ఆనుకొని ఉన్న మెట్ల కింద ఇలా కట్టుకోవడం దోషం. ఇంటికి ఆనుకోకపోయినాసరే మెట్ల కింద కట్టుకోకూడదు. ఇంటి బయట, ఇంటికి ఆనుకొని ఏ దిక్కులో ఈ దోషాన్ని ఏర్పరుస్తుంటామో, అందుకు సంబంధించినటువంటి సరైన ఫలితాలు సజావుగా దొరకవు. ఆ దిక్కు దోషపూరితమవడం వలన అక్కడ నుంచి రావలసిన మంచి ఫలితాలు సజావుగా అందవు. పైగా ఆ దోషం వలన అందుకు విరుద్ధమైన దుష్ఫలితాలు కలిగే అవకాశాలు ఎక్కువ.

మెట్లు ఎక్కడ కట్టినా సరే, టాయిలెట్స్ కానీ స్టోర్ రూములు కానీ ఇంకే విధమైన గదులు కానీ మెట్ల క్రింద ఎట్టి పరిస్థితుల్లోనూ కట్టకపోవడం అన్ని విధాలా మంచిది. ■

వాస్తు విద్వాన్ డా॥ దంతూరి పండరినాథ్ పాఠకుల సమస్యలకు ఆదివారం 'వాస్తువార్త'లో సమాధానాలిస్తారు. ఈ కింది కూపన్ జతచేసి సమస్యలు పంపవలసిన చిరునామా: **సాయిశ్రీ వాస్తు కన్సల్టెన్సీ, 3-2-4, కింగ్స్‌వే, రాష్ట్రపతి రోడ్, సికింద్రాబాద్-3**

**వాస్తువార్త**


పూర్తి పేరు : ........................................

పుట్టిన తేది : ........................................

జన్మ నక్షత్రం: ................తల్లి పేరు: ............

చిరునామా:...........................................

## అందాయి



**ఫణిగిరి బుద్ధిస్ట్ సైట్**
రచన: ఆనంద్
ప్రతులకు: సాయిశ్రీ పబ్లికేషన్స్
1-10-114, అంబేద్కర్ నగర్
సూర్యాపేట-508 213

**కడలి**
**తెలుగు సాహితీవనం కథల సంకలనం**
సంపాదకులు: శాంతికృష్ణ
ప్రతులకు: శాంతికృష్ణ
నెల్లూరు, హైదరాబాద్

**మేము-మా యాత్రలు**
షామీర్ జానకీదేవి
ప్రతులకు: నవోదయ బుక్ హౌస్
కాచీగూడ, హైదరాబాద్

**భావలావణ్యం** (కథాసంపుటి)
రచయిత: లావణ్య బుద్ధవరపు
ప్రతులకు: నవోదయ బుక్ హౌస్
కాచీగూడ, హైదరాబాద్.

**కడిమిళ్ళ శతకము** (గురుస్తుతి)
రచన: మంకు శ్రీను
ప్రతులకు: మంకు వెంకటరమణ,
కొప్పర్రు, నరసాపురం మండలం
పశ్చిమ గోదావరి జిల్లా
ఆంధ్రప్రదేశ్-534 275.



# ప్రాచీన దేవాలయాలు

ఇలపావులూరి వెంకటేశ్వర్లు

ఆలయ దర్శనం

మన రాష్ట్రంలో అనేక పురాతన దేవాలయాలు చిన్న చిన్న గ్రామాలలో నెలకొని ఉన్నాయి. ప్రతి ఒక్క ఆలయం ఎంతో పురాణగాథ, చరిత్రకు ప్రతిరూపంగా ఉండటం విశేషం. అదే విధంగా ఈ ఆలయాలలో ఏదో ఒక ప్రత్యేకత, ప్రాధాన్యత, విశేషం కనపడటం అపూర్వంగా చెప్పుకోవచ్చు.

అలాంటి మన రాష్ట్రంలోని క్షేత్రాలను వదిలేసి మనం ఎక్కడెక్కడో ఏదో ఉన్నది అని వెళుతుంటాం. తెలుగు వారమైన మనం మన దేవాలయాల అభివృద్ధికి కృషి చేయాలి. అది మన కనీస బాధ్యత.

ఆంధ్రప్రదేశ్‌లోని మారుమూల గ్రామాలలో నెలకొన్న ఆలయాలను కొంత కాలంగా సందర్శిస్తున్న నాకు చూసిన తరువాత ఎంతో ఆశ్చర్యం కలిగింది. మన రాష్ట్రంలో ఇంతటి గొప్ప ఆలయాలు ఉన్నాయా? అన్న విస్మయంతో పాటు ఆనందం కూడా కలిగింది. వాటిల్లో ఒక ప్రత్యేక ఆలయం మీకు పరిచయం చేద్దామని అనుకొంటున్నాను. ఎందుకని ప్రత్యేకం అని అంటున్నాను అంటే ఇలాంటి ఆలయం మన దక్షిణ భారతదేశంలో మరెక్కడా లేకపోవడమే!

క్రీస్తు పూర్వం మూడవ శతాబ్దం నుండి మన తెలుగు ప్రాంతాలను పాలించిన రాజ వంశాలు ఎన్నో ఉన్నాయి. ప్రసిద్ధికెక్కినవారు కాకుండా స్థానిక సామంతులు, కొంత కాలం కొన్ని ప్రాంతాలను స్వతంత్రులుగా పాలించిన వారిని కూడా లెక్కలోనికి తీసుకొంటే ఆ సంఖ్య ఇంకా పెరుగుతుంది. వారిలో శాతవాహనుల దగ్గర నుండి ఇక్ష్వాకులు, పల్లవులు, చోళులు, పాండ్యులు, చాళుక్యులు, రాష్ట్రకూటులు, కాకతీయులు, రెడ్డిరాజులు, విజయనగర రాజులు, గజపతులు, సుల్తానులు, ఫ్రెంచివారు, ఆంగ్లేయులు ఉంటారు.

వీరంతా ప్రజారంజకంగా పాలించడమే కాకుండా తాము అనుసరించిన ఆరాధన, విధానాలను, సంప్రదాయాలను కూడా పరిచయం చేశారు. వీరి కాలాలలోనే అనేక హిందూ దేవాలయాలు నెలకొల్పబడ్డాయి. వీరే కాకుండా అనేక మంది స్థానిక పాలకులు కూడా తమ ప్రాంతాల అభివృద్ధికి కృషి చేయడమే కాకుండా హిందూ ధర్మాన్ని పరిరక్షించడానికి అనేక ఆలయాలను నిర్మించారు.

వారిలో ఒకరు "ఆనంద గోత్రీకులు". వీరు నేటి పలనాడు జిల్లాలోని "కందరపురం" ను రాజధానిగా చేసుకొని ఇప్పటి గుంటూరు, కృష్ణా జిల్లాలను పాలించారని శాసనాధారాల వల్ల తెలుస్తోంది. వీరి పాలనాకాలం క్రీస్తు శకం నాలుగు నుండి అయిదు శతాబ్దాల మధ్య కాలంగా చరిత్రకారులు తెలుపుతున్నారు.

శక్తివంతమైన పల్లవులను కూడా ఓడించిన ఆనంద గోత్రీక రాజులు తమ రాజధానికి సమీపంలోని చేజెర్లలో "శ్రీ కపోతేశ్వర స్వామి ఆలయాన్ని" నిర్మించారు.

ఈ ఆలయం ఉన్న ప్రదేశంలో గొప్ప దానశీలిగా ప్రసిద్ధికెక్కిన శిబి చక్రవర్తి ఒక యజ్ఞం చేసారని, ఇక్కడే ఇంద్రుడు, అగ్నిదేవుడు శిబి దానగుణాన్ని పావురం, డేగ రూపాలలో వచ్చి పరీక్షించారని తెలుస్తోంది. ఇది చాలా గొప్ప ఆలయం. నరసరావుపేటకు పాతిక కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. తాము పాలించిన ప్రాంతాలలో అనేక దివ్యధామాలను నిర్మించారు. అలాంటి వాటిలో గుంటూరు జిల్లాలో కృష్ణాతీరంలో మరో విశేష ఆలయాన్ని నిర్మించారు.

## శ్రీ ఆనందేశ్వరస్వామి ఆలయం

మన రాష్ట్రంలో ప్రవహించే జీవనదులలో ఒకటి కృష్ణా నది. కోట్లాది ఎకరాలను సస్యశ్యామలం చేస్తూ లక్షలాది మంది ప్రజల దాహార్తిని తీర్చే పావన నదీతీరంలో కొన్ని వందల దివ్య ధామాలు నెలకొని ఉండటం ప్రస్తావించవలసిన విషయం.

గుంటూరు, కృష్ణా జిల్లాల్లోని తీరంలోని అనేక గ్రామాలలో పురాతన ఆలయాలు కనపడటం దీనికి నిదర్శనం. అలా పవిత్ర నదీతీరంలో ఉన్న ఒక చిన్న గ్రామం "పెద కొండూరు". చుట్టూ పచ్చని పొలాలు. స్వచ్ఛమైన గాలి, చక్కని పల్లె వాతావరణం. పక్కనే గలగలా ప్రవహించే కృష్ణవేణి. రమణీయమైన ప్రదేశం పెదకొండూరు. ఈ చిన్న గ్రామంలో నాలుగు పురాతన ఆలయాలు ఉండటం ఎవరినైనా విస్మయపరుస్తుంది.

శ్రీ కనకపుట్లమ్మ తల్లి ఆలయంలో కొన్ని శతాబ్దాల క్రితం అమ్మవారు స్వయంవ్యక్తగా అవతరించారు. శ్రీ జనార్ధన స్వామి, శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయాలను చాళుక్య రాజుల కాలంలో పదవ శతాబ్దంలో నిర్మించినట్లుగా తెలుస్తోంది. ముఖ్యమైన ఆలయం శ్రీ ఆనందేశ్వర స్వామి అర్ధనారీశ్వర లింగంగా కొలువైనది. ఆనంద గోత్రీకులు తొలి నుండి శివారాధకులు. చేజర్లతో సహా వీరు నిర్మించిన వాటిలో అధికశాతం శివాలయాలే!

ఈ వంశానికి చెందిన మొత్తం ముగ్గురు రాజులలో ఆఖరివాడు మాత్రం బౌద్ధమతాన్ని అనుసరించారని చెబుతారు. పల్నాడు జిల్లాలోని ప్రముఖ శైవ క్షేత్రం అయిన కోటప్పకొండ ఆలయానికి కూడా వీరు కైకర్యాలు సమర్పించినట్లు తెలుస్తోంది. పెదకొండూరు గ్రామంలో ఆనంద గోత్రీక రాజ్య స్థాపకుడైన శ్రీ కందరాజు ఈ ఆలయాన్ని క్రీస్తు శకం నాలుగవ శతాబ్ద మధ్య కాలంలో నిర్మించినట్లు తెలుస్తోంది. పునః నిర్మించబడిన ప్రస్తుత ఆలయంలో ఆ కాలంనాటి అనేక శిల్పాలు కనిపిస్తాయి. తూర్పు ముఖంగా ఉండే ఈ ఆలయంలో విశాల ప్రాంగణానికి ఎలాంటి రాజగోపురం ఉండదు.



ఈశాన్యంలో నవగ్రహ మండపం, గర్భాలయానికి ఎదురుగా ఎత్తైన ధ్వజస్తంభం. బలిపీఠం, నంది దర్శించుకోవచ్చు.

ఆలయ ఉత్తరం పక్కన పురాతన ఆలయంలో ఉన్న శిల్పాలను ఒక క్రమపద్ధతిలో ఉంచారు. వాటిలో సప్త మాతృకలు, శ్రీ గణేశుడు, త్రిమూర్తులు, శ్రీ సూర్యభగవానుడు, శ్రీ సరస్వతీ సమేత శ్రీ బ్రహ్మదేవుడు, అనేక నాగ శిల్పాలు కనపడతాయి. ఇక్కడే శ్రీ సుబ్రహ్మణ్య సన్నిధి, నాగపుట్ట కనపడతాయి.

నూతనంగా నిర్మించిన ముఖమండపానికి అనుబంధంగా రెండు సన్నిధులు ఉంటాయి. మధ్యలో శ్రీ వినాయకుడు ఉపస్థితులై దర్శనమిస్తారు.

శ్రీ పార్వతీ అమ్మవారు సర్వాభరణ భూషితురాలై నిండైన అలంకరణలో ప్రసన్న వదనంతో భక్తులకు అభయం ప్రసాదిస్తుంటారు.

ప్రధాన గర్భాలయంలో శ్రీ ఆనందేశ్వర స్వామి తెల్లని లింగ రూపంలో చక్కని చందన కుంకుమ, విభూతి అలంకరణలో నేత్రపర్వంగా కొలువై ఉంటారు. ఆనంద గోత్రీకులు ప్రతిష్టించిన స్వామిని ఆ పేరుతోనే పిలుస్తున్నారు. విశేషం ఏమిటంటే మరెక్కడా లేని విధంగా ఒకే లింగంలో పైన స్వామివారి రూపం కింద అమ్మవారి రూపం కనపడతాయి. పురావస్తు శాస్త్రవేత్తలు ఇలాంటి లింగం మరెక్కడా లేదని ప్రకటించారు.

దేశంలో మరెక్కడా లేని శ్రీ అర్ధనారీశ్వర లింగం మన రాష్ట్రంలో ఉండటం మనకి గర్వకారణం. శ్రీ అర్ధనారీశ్వర స్వామి ఆలయానికి ఎదురుగా శ్రీ కనక పుట్లమ్మ అమ్మవారి ఆలయం ఉంటుంది.

## శ్రీ కనక పుట్లమ్మ అమ్మవారి ఆలయం

అమ్మవారు స్వయంవ్యక్తగా గ్రామస్థులకు దర్శనమిచ్చి ఇక్కడ కొలువయ్యారని పురాణగాథ.

ప్రతిరోజూ గ్రామస్తులే కాక చుట్టుపక్కల గ్రామాలవారు, దూర ప్రాంతాలలో స్థిరపడినవారు తరలి వచ్చి మొక్కులు తీర్చుకొంటుంటారు. అమ్మవారు సకల దోషాలను తొలగించి జీవితాలలో సుఖశాంతులను నింపుతారన్నది తరతరాల విశ్వాసం. ముఖ్యంగా పెళ్లి కానివారు, పిల్లలు లేనివారు వస్తుంటారు. అమ్మవారికి మొక్కుకుంటే వివాహం అవుతుందని, సత్సంతానం కలుగుతుంది అన్నది భక్తుల నమ్మకం.

అమ్మవారికి భక్తులు పాలపొంగళి అక్కడ వండి నివేదన చేస్తారు. ఆలయం వద్ద చక్కని ఏర్పాట్లు చేశారు.

ఆ ఆలయంలో దసరా మహోత్సవాలు పెద్ద ఎత్తున చేస్తారు. ప్రతి నెలా ఒక ఉత్సవం జరుగుతుంది. పూజలు జరిగే ఆలయం ఉదయం నుండి సాయంత్రం వరకు నిరంతరాయంగా తెరిచి ఉంటుంది.

ముఖ్యమైన ఈ రెండు ఆలయాలు కాకుండా గ్రామంలో పదవ శతాబ్దంలో చాళుక్య రాజులు నిర్మించిన శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయం, శ్రీ జనార్ధన స్వామి ఆలయం కూడా ఉన్నాయి.

సుమారు పన్నెండవ శతాబ్ద కాలంలో పొన్నూరుకు సమీపంలోని చందోలుని రాజధానిగా పాలించినవారు వెలనాటి చాళుక్యులు. వీరు తదనంతర కాలంలో తమిళనాడుకు చెందిన చోళులతో అదేవిధంగా పల్నాడును పాలించిన హైహేయ వంశస్థులతో సంబంధ బాంధవ్యాలు ఏర్పరచుకున్నారు. నేటి కృష్ణా పరివాహక ప్రాంతంలో వీరి కాలంలో నిర్మించిన ఆలయాలు కనపడతాయి.

శ్రీ రాజరాజేశ్వర స్వామి, శ్రీ జనార్ధనస్వామి ఆలయాలు రెండూ వీరు నిర్మించినవే !

తరువాత అనేక మంది రాజ వంశాలవారు ఈ ఆలయాలను అభివృద్ధి చేశారు. ఆలయ నిర్వహణకు వీరు భూమి, ధనం సమర్పించుకున్నారు.. అని తెలుస్తోంది.

మన తెలుగు రాష్ట్రాలలో ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌లో చిన్న చిన్న గ్రామాలలో కూడా పురాతన ఆలయాలు కనిపిస్తాయి. వీటిలో కొన్ని ఎంతో ప్రత్యేకమైనవి. విశేష క్షేత్ర గాథ, ఇతర విశేషాలు కలిగి వుండటం ఈ ఆలయాల ప్రత్యేకత.

**మన ఆలయాలను మనం సందర్శిద్దాం. అభివృద్ధికి పాటుపడదాం.**

శ్రీ అర్ధనారీశ్వర స్వామి (శ్రీ ఆనందేశ్వర స్వామి) ఆలయం ఉన్న పెదకొండూరు విజయవాడ నగరానికి ఇరవై అయిదు కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. తాడేపల్లి నుండి రేపల్లె వెళ్లే కరకట్ట మార్గంలో వెళ్ళాలి.

ఇక్కడ వసతి భోజన సౌకర్యాలు లభించవు. విజయవాడ నుండి రేపల్లె వెళ్లే బస్సులు ఆగుతాయి. సొంత వాహనంలో వెళితే చుట్టుపక్కల ఉన్న తూములూరు, చిలుమూరు, ఈమని, కొల్లిపర, దుగ్గిరాల, నందివెలుగు గ్రామాలలోని పురాతన ఆలయాలను కూడా సందర్శించుకోవచ్చు.

---

– చిన్న పిల్లల్ని గురించి తెలుసుకుంటే అన్నీ తెలుసుకున్నట్లే.

– ప్రతి దశలోనూ పిల్లలు నిజమైన జీవితానుభవాలు గ్రహించేటట్లు చూడాలి.

– మంచిగా ఉండటం ఉత్తమం. మంచిగా వుండటాన్ని యితరులకు బోధించడం మరింత ఉత్తమం.

– లోపల ఏడ్వడం కన్నా బయటికి ఏడిస్తే కొంత భారం తగ్గుతుంది.

# అవగాహన అవసరం

సంగనభట్ల రామకిష్టయ్య

**వస్తువులు, సేవల నాణ్యత, సామర్థ్యం, స్వచ్ఛత, ధర, ప్రమాణం.. వీటికి సంబంధించిన సమాచారాన్ని తెలుసుకొనే హక్కును కలిగి ఉండటాన్ని వినియోగదారుల హక్కు అంటారు.**

1962 మార్చి 15న అమెరికా దిగువ సభలో వినియోగదారుల హక్కుల బిల్లును ప్రతిపాదించగా అమెరికా మాజీ అధ్యక్షుడు జాన్ ఎఫ్ కెనడి అమెరికా ప్రజలకు మొదటిసారిగా నాలుగు వినియోగదారుల హక్కులు ప్రకటించాడు.

1972లో అంతర్జాతీయ వినియోగదారుల సంఘాల సంస్థ ప్రాంతీయ సంచాలకుడు అన్వర్ ఫజల్ మార్చి 15వ తేదీని ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవంగా పరిగణించాలని తీర్మానించారు. దాంతో ప్రపంచ వ్యాప్తంగా దాదాపు 20 సంఘాలు, సంస్థలు 1973 మార్చి 15వ తేదీని వినియోగ దారుల హక్కుల దినంగా పాటించాయి.

భారతదేశంలో 1986లో వినియోగ దారుల ప్రయోజనార్థం, వారి హక్కుల పరిరక్షణ కోసం వినియోగ దారుల హక్కుల పరిరక్షణ చట్టం రూపొందించారు. భారత రాష్ట్రపతి ఆమోదంతో 1986 డిసెంబర్ 24న ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ చట్టం ప్రకారం వినియోగదారులకు ఆరు హక్కులు ప్రకటించింది.

**సురక్షిత వినియోగ హక్కు:** ప్రాణాలకు/ఆరోగ్యానికి హానికరమైన వస్తువులు, సేవల నుండి రక్షణ పొందే హక్కు.

**సమాచారం పొందే హక్కు:** వినియోగదారులు కొనుగోలు చేసే వస్తువుల నాణ్యత, ధర, పరిమాణం, ప్రమాణాలు వంటి సమాచారాన్ని పొందే హక్కు.

**ఎంపిక హక్కు:** వినియోగదారులు స్వేచ్ఛగా ఉత్తమమైన వస్తువులను, సేవలను ఎంపిక చేసుకునే హక్కు.

**ప్రాతినిధ్యం హక్కు:** వినియోగదారుల హక్కుల కోసం సంఘాలు, ఫోరమ్‌ల ద్వారా ప్రాతినిధ్యం వహించే హక్కు.

**పరిహారం పొందే హక్కు:** లోప భూయిష్టమైన వస్తువులు లేదా నాసిరకమైన సేవల వల్ల నష్టపోయిన వినియోగదారులు పరిహారం పొందే హక్కు.

**వినియోగదారుల విద్య హక్కు:** వినియోగదారుల హక్కులపై అవగాహన పెంచుకోవడానికి విద్య పొందే హక్కు.

ఆరోగ్యకరమైన పర్యావరణం హక్కు.. ప్రస్తుత, భవిష్యత్ తరాల వారికి హాని కలిగించని ఆరోగ్యకరమైన పర్యావరణంలో జీవించే హక్కు. వినియోగ దారుల రక్షణ మానవ ప్రాణాలకు, ఆస్తికి ప్రమాద కారక వస్తువులు, సేవల నుంచి రక్షణ పొందే హక్కు... అవసరాలు తీర్చడమే కాకుండా, దీర్ఘకాలం మన్నే వస్తువులు, సేవలను పొందాలి.

## సమాచారం పొందే హక్కు

అవాంఛిత వ్యాపార కార్యకలాపాల నుంచి వినియోగదారులకు రక్షణ కల్పించేందుకు వస్తు నాణ్యత, బరువు, స్వచ్ఛత, పుష్టి, ప్రమాణం గురించి తెలియ జేయాలి. నాణ్యమైన సేవలు పొందే సమాచారాన్ని తెలుసుకునే హక్కు ఉంది.



## వస్తువులను, సేవలను ఎంపిక చేసుకునే హక్కు

వివిధ రకాల వస్తువులు, సేవలు పొందేటప్పుడు వాటి మధ్య రేటు తెలుసుకోవడం మంచిది. సముచిత రేటులో నాణ్యత, సేవలు పొందడం. ప్రాతినిధ్యం వహించే హక్కు... వినియోగదారుల ఆసక్తిని, వారి అవసరాలను సరైన వేదికలు, ఫోరంలలో వినిపించడం. వినియోగదారుల సంక్షేమార్థం ఏర్పాటు చేసిన వివిధ వేదికలలో ప్రాతినిధ్యం వహించడం.

వినియోగ దారుల ఫోరంలో విజ్ఞప్తి చేయడం ద్వారా సేవాలోపాలు, వస్తు లోపాల నుండి పరిహారం పొందే హక్కు... వినియోగదారులు మోసానికి గురయినప్పుడు ఫోరంలో కేసులు వేసి, తగిన పరిహారాన్ని పొందడం.

## వినియోగదారుల విద్య హక్కు

వినియోగదారులు నిరంతరం తమ హక్కుల గురించి తెలుసుకుంటూ, తమ జ్ఞానాన్ని పెంచుకోవడం, నైపుణ్యాలను పెంపొందించుకోవడం ఎంతో అవసరం. గ్రామీణ ప్రాంతాలలో వినియోగదారులు హక్కుల పట్ల అవగాహన లేక ఎంతో మోసపోతున్నారు.

భారత ప్రభుత్వం 1989లో మార్చి 15వ తేదీని వినియోగదారుల దినోత్సవంగా ప్రకటించింది. అప్పటి నుంచి ప్రతి సంవత్సరం మనం ప్రపంచ వినియోగదారుల దినోత్సవాన్ని మార్చి 15న జరుపుకుంటున్నాం.

నూతన వ్యాపారాభివృద్ధి సంస్కరణల వల్ల ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా ఆన్ లైన్‌లో, ఈకామర్స్, టెలిషాపింగ్ విధానంలో వస్తువుల్ని కొనుగోలు చేస్తున్నారు. ప్రజలను మోసగించే సైబర్ నేరాలు దీని వల్ల చోటు చేసుకుంటున్నాయి. వినియోగదారులను తప్పుడు ప్రకటనలు, సందేశాలతో మోసగించడం పెరిగిపోతున్నది. దీంతో వినియోగదారుల హక్కుల రక్షణ కోసం కొత్త చట్టాల ఆవశ్యకత ఏర్పడింది.

1986 నాటి చట్టం స్థానంలో 2019లో మరో చట్టాన్ని రూపొందించారు. అది ఈ 2020 సంవత్సరంలో అమలులోకి వచ్చింది. వాణిజ్య వ్యాపారాల్లో, ప్రభుత్వ యంత్రాంగంలో, సేవా సంస్థల్లో పని చేసేవారు నిర్లక్ష్యంగా, మోస పూరితంగా వ్యవహరించినప్పుడు కఠిన చర్యలు తీసుకునేందుకు ప్రపంచంలోని చట్టాలన్నింటి కన్నా మెరుగ్గా-

భారతదేశంలో తొలిసారి 1986లో వినియోగదారుల హక్కుల పరిరక్షణ చట్టాన్ని రూపొందించారు. తక్కువ సమయంలో, అతి తక్కువ రుసుముతో, దళారుల ప్రమేయం లేకుండా జిల్లా, రాష్ట్ర, జాతీయ వినియోగదారుల ఫోరాల్ని, కమిషన్లను ఆశ్రయించి వ్యక్తిగతంగా సత్వర న్యాయం పొందే సౌలభ్యం దీని ద్వారా లభించింది. ఇప్పుడు సైబర్ నేరాల కారణంగా దాని స్థానంలో కొత్త చట్టాన్ని తెచ్చారు. ఈ నూతన చట్టాన్ని 2020 జులై 20 నుంచి దేశ వ్యాప్తంగా అమలు పరుస్తున్నారు.

వినియోగదారులకు తక్కువ ఖర్చులో, ఇబ్బందులకు తావు లేని రీతిలో, శీఘ్రంగా ఫిర్యాదులను పరిష్కరించే వెసులుబాటు కల్పించాలనే సంకల్పంతో దేశ వ్యాప్తంగా వేరు వేరు స్థాయిలలో వినియోగదారుల వేదికలను నెలకొల్పడం జరిగింది. వినియోగదారులు రక్షణ చట్టంలోని 9వ సెక్షన్ మూడు అంచెల వివాద పరిష్కార సంస్థల ఏర్పాటుకు మార్గం సుగమం చేసింది.

(ఎ) కేంద్ర ప్రభుత్వం నోటిఫికేషన్ ద్వారా ఏర్పాటు చేసే జాతీయ వినియోగదారు వివాదాల పరిష్కార సంఘం. ఈ కోర్టునే జాతీయ సంఘంగా వ్యవహరిస్తారు.

(బి) కేంద్ర ప్రభుత్వం ముందస్తు అనుమతితో రాష్ట్ర ప్రభుత్వం ఒక నోటిఫికేషన్ ద్వారా ఏర్పాటు చేసే రాష్ట్ర వినియోగదారు పరిష్కార సంఘం. ఈ కోర్టునే రాష్ట్ర సంఘంగా కూడా వ్యవహరిస్తారు.

(సి) రాష్ట్ర ప్రభుత్వం ఒక నోటిఫికేషన్ ద్వారా ఆ రాష్ట్రంలోని ప్రతి జిల్లాలోనూ ఏర్పాటు చేసే వినియోగదారుల వివాదాల పరిష్కార వేదిక. ఈ కోర్టునే డిస్ట్రిక్ట్ ఫోరమ్‌గా కూడా వ్యవహరిస్తారు. ఈ ఏజెన్సీలన్నీ వాటి స్వభావం, అధికారాల పరంగా క్వాసీ జ్యుడీషియల్ యంత్రాంగంగా పని చేస్తాయి.

జాతీయ స్థాయిలో సెంట్రల్ కన్స్యూమర్ అథారిటీ అనే ప్రత్యేక వ్యవస్థను రూపొందించి తగిన విచారణాధికారాలు, విచక్షణాధికారాలు కల్పించారు. ఇందులో డైరెక్టర్ జనరల్ స్థాయి అధికారితో కూడిన కమిటీ ఉంటుంది. నేరాలకు పాల్పడినట్లు నిరూపితమైన వ్యక్తులపై, సంస్థలపై అవసరమైన చర్యలు తీసుకుంటారు. నూతన చట్టం ప్రకారం.. అరెస్టులు చేయించే అధికారం, మూడు సంవత్సరాల వరకు జైలు శిక్షను, పది లక్షల రూపాయల వరకూ జరిమానాను విధించే అధికారం సెంట్రల్ అథారిటీకి ఉంటుంది. జిల్లా కమిషన్లు ఇచ్చిన తీర్పులపై ఉన్నత రాష్ట్ర స్థాయి కమిషన్‌ను ఆశ్రయించేందుకు వ్యతిరేక పార్టీ కనీసం యాభై శాతం లేదా రూ.25 వేలు రాష్ట్ర కమిషన్‌లో డిపాజిట్ చేయాల్సి ఉంటుంది. గతంలో ఉన్న 30 రోజులకు బదులుగా 45 రోజులుగా కాల వ్యవధిని నిర్ణయించారు. రాష్ట్ర కమిషన్‌లో ప్రెసిడెంట్‌తో పాటు విధిగా నలుగురు సభ్యులుండాలి. రెండు బెంచీలు నిర్వహించి వినియోగదారులకు సత్వర న్యాయం అందించేందుకు కృషిచేయాలి. ఈ మేరకు రాష్ట్రాలను కేంద్రం ఆదేశించింది. భవిష్యత్తులో జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో అధ్యక్షులు, సభ్యుల నియామకం కాలాన్ని ఐదేండ్లకు బదులు నాలుగేండ్లకు కుదించారు. గరిష్ఠ వయస్సు 65 యేండ్లుగా నిర్ణయించారు.

> అందరితో ఒకేలా ఉండేవానిని అందరూ గొప్పగా ప్రేమిస్తారు. ప్రేమించడం అంటే హృదయంతో ప్రశంసించడం. ప్రశంసించడం అంటే మనస్సుతో ప్రేమించటం.






రాష్ట్ర లీగల్ సెల్ అథారిటీ ఆధ్వర్యంలో వినియోగ దారుల హక్కుల పరిరక్షణ గురించి విస్తృతంగా ప్రచారం చేయాలి. నూతన వినియోగదారుల హక్కుల పరిరక్షణ చట్టంపై సమగ్ర అవగాహన కల్పించేందుకు పాఠశాలల్లో, కళాశాల, విశ్వ విద్యాలయాల్లో పాఠ్య పుస్తకాల్లో, పాఠ్యాంశాల్లో వినియోగ దారుల విద్య, చట్టం ప్రాధాన్యం, అమలుపై గురించి తెలియజేయాలి. టెలీ మార్కెటింగ్, ఈకామర్స్ ద్వారా మోసగిస్తున్న సంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలి. అనవసర వస్తువులను కొనుగోలు చేయించేందుకు తప్పుదారి పట్టించే ప్రకటనలపై నియంత్రణ అవసరం. హోటళ్ల, ఆసుపత్రులు, ప్రయాణ సేవలు వంటి రంగాల్లో వినియోగదారుల హక్కులను మరింత బలోపేతం చేయాలి. వినియోగదారులు తమ హక్కులను కాపాడుకోవడానికి వస్తువులు, సేవలు కొనేటప్పుడు వాటి నాణ్యత, ధర, ఇతర వివరాలను తెలుసుకోవాలి. వస్తువులు, సేవలు కొన్నప్పుడు తప్పనిసరిగా రసీదు తీసుకోవాలి. ఏదైనా సమస్య తలెత్తితే సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయాలి.

ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకుని, ప్రతి వ్యక్తి తన హక్కులను తెలుసుకోవాలి. ఈ హక్కుల పరిరక్షణ కోసం ప్రభుత్వాలు, స్వచ్ఛంద సంస్థలు, వినియోగదారుల సంఘాలు కలిసి పని చేయాలి. మనం జాగ్రత్తగా ఉంటే, సరైన నిర్ణయాలు తీసుకుంటే మోసపోకుండా కాపాడుకోవచ్చు. వినియోగదారుల హక్కుల పరిరక్షణ అందరూ ఒక సామాజిక బాధ్యతగా గుర్తించాలి.



# వారఫలం

శ్రీమతి ములుగు శివజ్యోతి, ప్రముఖ జ్యోతిష్యురాలు
నారాయణ నాయక్ కాంప్లెక్స్, 2వ అంతస్తు,
గాంధీ జ్ఞానమందిర్ వెనుక, కోఠి, హైదరాబాద్-1
ఫోన్ : 98494 53449, 9440927795

## మేషం

ఈ వారం ప్రతి ఒక్క విషయంలోనూ నిరాశకు గురి చేయడం, ఇబ్బందికరమైన మాటలు వినటం, పెద్ద సమస్యగా మారుతుంది. ఇలా మాట్లాడే వారికి దూరంగా ఉండాలని మీ ఆలోచనలు ఆచరణలో మాత్రం అంతంత మాత్రంగానే ఉంటాయి. ఇంట్లో వ్యాపార ప్రదేశాల్లో కప్పు సాంబ్రాణి, దైవికం పొడితో ధూపం వేయండి నరదిష్టి తొలగిపోతుంది.

## వృషభం

ఈ వారం అనుకూలమైన వాతావరణం నూతనోత్సాహం ఇస్తుంది. ఆర్థిక పరిస్థితి అనుకూలంగా ఉంటుంది. ప్రముఖులతో పరిచయాలు ఏర్పడతాయి. సంఘంలో గౌరవ ప్రతిష్టలు పెంపొందుతాయి. జిల్లేడు వత్తులతో అష్టమూలికా తైలంతో దీపారాధన చేయండి ఆటంకాలన్నీ తొలగిపోతాయి. భవిష్య ప్రణాళికల గురించి చర్చించి, అధికంగా లాభం వచ్చే స్వల్పకాలిక వ్యాపారాలలో ధనాన్ని పొదుపు చేస్తారు.

## మిథునం

ఈ వారం గృహ సమస్యల నుంచి బయటపడతారు. స్నేహ ఒప్పందాలు బలపడతాయి. వృత్తి సంబంధమైన అభివృద్ధిలో ఆటంకాలు తొలగిపోతాయి. వెన్నునొప్పి బాధించే సూచనలు ఉన్నాయి. పూజలలో ఆరావళి కుంకుమను ఉపయోగించండి. సుమంగళి పసుపు తో గౌరీదేవి అమ్మవారి అష్టోత్తరం చదువుతూ అర్చన చేయండి. వివాదాలకు, విభేదాలకు దూరంగా ఉండండి.

## కర్కాటకం

ఈ వారం ఆర్థిక సంబంధ వ్యవహారాలలో లోటుపాట్లు తప్పక పోవచ్చు. విపరీతమైన పని ఒత్తిడి మీ ఆరోగ్యాన్ని చెడగొట్టవచ్చు. అకారణముగా ఒక మిత్రుడితో విరోధం రాకుండా ముందు జాగ్రత్త వహించండి. దైవానుగ్రహం అన్ని వేళలా అండగా ఉంటుంది. అష్టమూలిక తైలంతో లక్ష్మి తామర వత్తులతో దీపారాధన చేయండి.

## సింహం

:ఈ వారం దైవ దర్శనం చేసుకుంటారు. కుటుంబ బాధ్యతలు సమర్థవంతంగా నిర్వహిస్తారు. వ్యాపారానికి, ఉద్యోగానికి సంబంధించిన ఒక ఉపయోగకరమైన సమాచారాన్ని మీరు అందుకుంటారు. పూజలలో ఆరావళి కుంకుమను ఉపయోగించండి. మాట తొందరపాటు మిమ్ములను ఇబ్బందులకు గురి చేసే సూచనలు ఉన్నాయి. జాగ్రత్త వహించండి.

## కన్య

ఈ వారం మీ తెలివితేటలు నైపుణ్యం ప్రదర్శించటానికి ఒక చక్కని అవకాశము మీ ముందుకు వస్తుంది. నేర్పుగా ఉపయోగించుకోండి. కొనుగోలు అమ్మకాల విషయంలో జాగ్రత్తలు పాటించండి. ప్రశాంతంగా ఆలోచించి కొన్ని నిర్ణయాలు తీసుకోవడం వలన ఆర్థికంగా లాభపడతారు. సిద్ధ గంధంతో శ్రీ వెంకటేశ్వర స్వామి వారికి అర్చన జరిపించండి.

## తుల

ఈ వారం ఇతరులను మెప్పించి మీ పనులు సానుకూల పరచుకుంటారు. అదృష్టం కలిసి వస్తుంది. ఒక ఆహ్వానానికి, ప్రకటనకు లేదా ఉత్తరానికి మీరు ప్రతిస్పందిస్తారు. తలపెట్టిన కార్యం జయం అవుతుంది. అష్టమూలికా తైలంతో లక్ష్మి తామర వత్తులతో దీపారాధన చేయండి. కార్యాలయంలో నూతనోత్సాహంతో శ్రమించి మంచి ఫలితాలు సాధిస్తారు. సాంకేతిక లోపం వలన మీకు అందవలసిన సమాచారం సకాలంలో మీకు చేరకపోవచ్చు.

## వృశ్చికం

ఈ వారం ఇంటర్వ్యూలలో అనుకూల ఫలితాలు సాధిస్తారు. ఎదురుచూడని అవకాశాలు కలిసి వస్తాయి. వాటిని నేర్పుగా ఉపయోగించుకోండి.పూజలలో ఆరావళి కుంకుమను ఉపయోగించండి. గోశాలలో గరిక దానం చేయండి. పూజలలో ఆరావళి కుంకుమను ఉపయోగించండి. విదేశీ అవకాశాల కోసం చేసే ప్రయత్నాలు కలిసి వస్తాయి . విదేశాలలో ఉన్నవారికి సొంత ఇంటి కల నెరవేరుతుంది.

## ధనస్సు

ఈ వారం వృత్తి ఉద్యోగ వ్యాపార సంబంధమైన విషయాలు అనుకూలంగా ఉంటాయి. అజీర్తి బాధించే అవకాశం ఉంది. ఒకానొక ప్రయాణం మీకు అనుకూలంగా మారుతుంది. శుభవార్తా శ్రవణం చేస్తారు. అరటినార వత్తులతో అష్టమూలికా తైలంతో దీపారాధన జరిపించండి. వ్యాపార లావాదేవీలు అనుకూలంగా ఉంటాయి. ముఖ్యమైన సమస్యలు పరిష్కారమవుతాయి.

## మకరం

ఈ వారం వ్యక్తిగత విషయాలకు ప్రాముఖ్యతనిస్తారు. కొనుగోలుకు అధికంగా ఖర్చు చేస్తారు. కుటుంబ అవసరాలను దృష్టిలో ఉంచుకొని కొన్ని కీలక నిర్ణయాలు తీసుకుంటారు. వాటిని అమలు పరుస్తారు. యోగాభ్యాసం ప్రకృతి వైద్యం ప్రత్యేకంగా ఆకర్షిస్తాయి. మీ ఇష్టదేవుళ్లకు మహాతీర్థం పొడితో అభిషేకం చేయడండి. కుటుంబంలో ఐకమత్యం మానసిక ప్రశాంతతను ఇస్తుంది. వ్యాపారంలో రొటేషన్ లాభాలు బాగుంటాయి.

## కుంభం


ఈ వారం సభలు, సమావేశాలకు గాను ఆహ్వానాలను అందుకుంటారు. ముఖ్యంగా ఎదుటి వారితో మాట్లాడేటప్పుడు మాట తీరు పట్ల జాగ్రత్తలు వహించండి. ప్రభుత్వపరమైన, చట్టపరమైన ఇబ్బందుల నుండి బయటపడ గలుగుతారు. గోమతి చక్రాలతో లక్ష్మీ దేవి అష్టోత్తరాన్ని చదువుతూ అమ్మవారికి పూజ చేయండి. శుభవార్తా శ్రవణం చేస్తారు. శుభకార్యాలు అనుకున్న విధంగా పూర్తి చేయడానికి గాను గ్రహగతులు అనుకూలిస్తాయి..


## మీనం

ఈ వారం స్వల్పంగా ధనలాభ సూచన. వ్యక్తిగత ప్రతిష్టను పెంపొందించు కోవడానికి గాను ప్రయత్నాలను మరింతగా ముమ్మరం చేస్తారు. ప్రభుత్వ ప్రైవేటు సంబంధిత పెండింగ్ బిల్స్ మంజూరవుతాయి. వృత్తి ఉద్యోగ వ్యాపారాల పరంగా అనుకూలమైన మార్పులు చోటు చేసుకుంటాయి. అష్టమూలిక తైలంతో లక్ష్మి తామర వత్తులతో దీపారాధన చేయండి. పెట్టుబడుల విషయంలో ఆచితూచి వ్యవహరిస్తారు.

# ఈ వారం కా'ర్టూన్స్'


ఏంటి బావా.. షేర్ మార్కెట్టా...!?


అక్క గుడ్ అట.. నేను
బ్యాడ్ అటా.. దానికి డాడ్
ఫోన్ కొనిచ్చేలా చూడు...
నీకు దండం పెడతా...!!


ఈరోజు మహిళా దినోత్సవం
సందర్భంగా వారి గౌరవార్థం..
మానభంగాలు, ఆత్మహత్యలు,
గృహ హింస..వార్తలు ఉండవు
BREAKING NEWS - 08|03








వియత్నాంలోని ఈ వీధిని ట్రైన్ స్ట్రీట్ అంటారు. రైల్వే ట్రాక్‌కు అత్యంత సమీపంలో రెస్టారెంట్లు వుంటాయి. అదీ దీని ప్రత్యేకత. ఈ వీధిలోకి ట్రైన్ వచ్చే ముందు సైరన్ మోగుతుంది. దాంతో పర్యాటకులు అప్రమత్తమవుతారు.

